# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

వెల : రూ. 10.00

సెప్టెంబరు 2026



**జూన్ 27 నుండి 29 వరకు అమెరికాలోని మెంఫిస్‌నందున్న శ్రీ వెంకటేశ్వరస్వామి మందిరం 32వ వార్షికోత్సవమునందు శ్రీ మాతాజీవారు పాల్గొన్న దృశ్యములు**









# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293206.
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**

డా॥ యమ్. స్వర్ణముఖి
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ
సన్నిధానం కాళీమాత

సంపుటి 46 సంచిక 1
పేజీలు 44
సెప్టెంబర్ 2026

5సం॥ల చందా రూ. 500
2సం॥ల చందా రూ. 240
సంవత్సర చందా రూ. 120
విడిప్రతి వెల...... రూ. 10

**బ్యాంక్ డ్రాఫ్ట్ Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా**
**మేనేజరు**
**సమర్థ సద్గురు మాగజైన్**
**శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు**
**గుంటూరు జిల్లా**

Printed & Published by
Paluri Siva Rama Kali Prasad
on behalf of
YOGINI SRI CHANDRA
KALI PRASADA MATHAJI
CHARITABLE TRUST
and Printed at
Nagendra Enterprises,
D.No.24-7-8, Sandeep Mansion
Jonnavittula Vari St.
Gandhi Nagar, Vijayawada
N.T.R. Dist., Andhra Pradesh.
Published at
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh, Editor
PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో** ............................. ....... **పేజీ**

శ్రీ కాళీ ప్రసాద శతకము .................... ..........4
శ్రీబాబూజీ ఉవాచ........................................ 5
అమ్మమాట........................................ ................. 7
అశ్వనీ దేవతలు ................................................ 9
భగవద్గీత సాధన దీపిక ...............................11
రామస్యదూతమసక్యన్నమామి..................13
అహింసా భావము............ .................... ...............16
శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద్ బాబూజీ మహరాజ్ వారి సహస్ర నామావళిః ......... 18
శ్యామ సుందరా! ఒక్కసారి, ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ! 20
నారద భక్తి సూత్రములు ............... ..............22
శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు....25
మాయా విలాసం........................... ..................26
భువిలో వెలసిన దివ్య కల్పతరువు............28
నిరీక్షణ ..................................................................30
శ్రీ గురుగీత .......................................... ........32
గురుకృప .......................................... .............34
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....36
పూరి - కామాఖ్య యాత్ర.............................38
విష్ణు కథలు ....... ............................ ....................41

## శ్రీ కాళీ ప్రసాద శతకము - పాలూరి ప్రసాద్

16. *మనసను వారధిని కట్టె, కొట్టె*
*నహంకారమను రావణు, దెచ్చె*
*ముక్తికాంత నాత్మారాముండు*
*కాళీ ప్రసాదు మాట కాంతిబాట ॥*

తా: రామాయణం అంతా 'కట్టె, కొట్టె, తెచ్చె' అని మూడు ముక్కలలో చెప్పవచ్చు అంటారు.



నిజమే! సర్వజీవుల యందు ఆత్మారాముడై రమించే పరమాత్మ ఆయా జీవులను భవబంధాల నుండి ముక్తిని పొందించడానికై గురు రూపంలో అవతరించి మనసనే వారధిని కట్టి, బంధానికి కారణమైన అహంకారమనే రావణాసురుని కొట్టి, ముక్తికాంత అయిన సీతను తెచ్చి ఆత్మయనే రామునితో జేరుస్తాడు.

1) అయిదు దివ్య కల్పతరువులు ఏవి?
2) కామక్రోధాదులను భగవంతుని వైపుకు మళ్ళించడం అంటే ఏమిటి?
3) ఏది ఏమైనా ఈరోజు తీర్పు చెప్పేస్తా అని వచ్చిన జడ్జిలో మార్పు ఎలా వచ్చింది?
4) రాజుగారి యజ్ఞానికి బలి పశువులను ఒక పవిత్ర సన్యాసి ఎందుకు తీసుకువచ్చారు?
5) విజయం ముందు ఎక్కడ పుడుతుంది?
6) మనకు భక్తి జ్ఞాన వైరాగ్యాలు ఎందుకు అవసరం?
7) గురు సాన్నిధ్యంలో ఉండటం వలన కలిగే ప్రయోజనం ఏమిటి?

***సమాధానాలు లోపలి పేజీలలో ..........................***

# శ్రీ బాబూజీ ఉవాచ - కీ.శే. పరాశర ప్రసాద్

10-11-1981

ఈరోజు ఉదయం శ్రీ బాబూజీ వాకింగ్‌కి వచ్చారు. 'పరమాత్ముడు భక్తునికి ఎందుకు పరీక్ష పెడతాడు?' అని శ్రీ బాబూజీ ప్రశ్నించారు. అందరు ఎవరికి తోచిన విధంగా వారు చెప్పారు.

శ్రీ బాబూజీ భగవద్భక్తుల చరిత్రను చదవమన్నారు. ఆ చరిత్ర ద్వారా ఏదో అందరికీ ఒక సందేశాన్ని అందించనున్నట్లు అర్థం అయింది. శివభక్తుడు గుగ్గిలం నయనార్ చరిత్ర చదివాము. ఆయన శివునికి గుగ్గిలం ధూపం వేసేవాడు. ఇంట్లో తినటానికి గింజలులేవు. భార్య మంగళసూత్రం అమ్మి తిండిగింజలు తెద్దామని వెళ్తుండగా దారిలో గుగ్గిలం బస్తా మోసుకుంటూ ఒక ముసలివాడు ఎదురయ్యాడు. అప్పుడు ఆ నయనారు వెంటనే ఆ గుగ్గిలాన్ని కొనేశాడు. తిండిగింజలు కొనాలన్న సంగతే మరచిపోయాడు.



శ్రీ బాబూజీ కల్పించుకొని 'చూశారా! అదే పరమాత్మ పరీక్ష అంటే. ఇక్కడ చూడండి భక్తునికి పరీక్ష పెట్టాడు. నీకు పొట్ట కావాలా? పరమాత్మ కావాలా? అన్న ప్రశ్న వచ్చింది. అప్పుడు ఆ భక్తుడు ఏం చేసేదీ ఆ భక్తుడి సంస్కారం బట్టి ఉంటుంది. ఆ పరీక్ష ఎందుకు పెడతాడంటే భక్తునిలో ఉన్న బీజాన్ని హరించటానికి' అన్నారు శ్రీ బాబు.

అలాగే ఇంకొకరి విషయంలో కామానికి పరమాత్మకి మధ్య పరీక్ష! మానవుడు కామంలో పడిపోతాడు. కామానికి లొంగిపోతాడు. రుక్మాంగదుడి చరిత్ర మీకు తెలిసిందే కదా! కాని భగవానుడు కరుణామయుడు. దాశరథీ కరుణాపయోనిధీ! అన్నారు. భక్తుడిని కష్టపెడతాడా? భక్తునికి అన్నం లేకుండా చేస్తాడా! అయితే అది కేవలం ఒక పరీక్ష. ఈ ప్రాపంచిక సుఖాలు ఎందుకు? నీకు శాశ్వత సుఖాన్నిస్తాను అంటాడు భగవంతుడు". శ్రీ బాబు ఈ విషయాలన్నీ చెప్పి అక్కడ ఉన్న భక్తులలో ఒక చెయ్యి కాలిన వ్యక్తిని "ఎలా ఉంది?" అని ప్రశ్నించారు. అలాగే ఇంకొకరిని "మీ దగ్గు ఎలా ఉంది, తగ్గిందా?" అని ప్రశ్నించారు. ఆ భక్తులు ఎంతో ప్రమాద స్థితి నుండి రక్షింపబడ్డారు.

శ్రీ బాబు మాట్లాడుతూ 'ఒకరికి ఏదైనా ఆపద సంభవించింది అనుకోండి. ఆ వ్యక్తిని భగవానుడు రక్షించాడు అనుకోండి. అప్పుడు ఆ వ్యక్తి తనకి రక్షణ జరిగినదానికి భగవానుని ప్రార్థించాలా? లేక అసలు భగవానుడు నాకు ఈ ప్రమాదం జరుగకుండా ఎందుకు కాపాడలేదని విచారించాలా? ఆలోచించండి. దీన్ని మీరు అర్థం చేసుకోండి చాలు. ఇది విన్న తర్వాత మీకు ఎలా వుంది? హాయిగా లేదా? గురుసమక్షం లోనే ఉండాలా? మన మనస్సు ఆయనపై నిలుపుకుంటే చాలదా! అని అంటారు. మరి ఇప్పుడు ఏమంటారు. స్వాతిచినుకుకోసం ముత్యపు చిప్ప ఎలా ఎదురుచూస్తాందో గురుబోధకోసం అలా ఎదురుచూడాలి. దాని ద్వారా హృదయకలుషాలు హరించిపోయి అది పవిత్ర క్షేత్రంగా మారిపోతుంది. ముత్యపుచిప్పలో పడ్డ వాన చినుకు ఏమవుతుంది? అది ముత్యమై శ్రీమన్నారాయణ మూర్తి కంఠంలో హారమై ప్రకాశిస్తుంది. అదే వానచినుకు నీటిపాలైతే వృథా అవుతుంది. కాబట్టి గురు సాన్నిధ్యంలో ఉండటం వలన అదీ ప్రయోజనం. అందుకని సజ్జనులనే ఆశ్రయించాలి" అన్నారు.

*పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు*

** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును**

**సెప్టెంబర్ 2026**

**4 శుక్ర: శ్రీ కృష్ణాష్టమి – శ్రీ సద్గురు పాదపూజ**

**6 ఆది: శ్రీ గురుదశమి – శ్రీ సద్గురు పాదపూజ**

**14 సోమ: వినాయకచవితి – శ్రీ సద్గురు పాదపూజ**

**26 శని: భాద్రపద పూర్ణిమ – శ్రీ సద్గురు పాదపూజ**

**అక్టోబర్ 2026**

**5 సోమ: శ్రీ గురుదశమి – శ్రీ సద్గురు పాదపూజ**

**11 ఆది: శ్రీ దేవీ శరన్నవరాత్రి ప్రారంభం**

**20 మంగళ: విజయదశమి – శ్రీ సద్గురు పాదపూజ**

**26 సోమ: ఆశ్వయుజ పూర్ణిమ – శ్రీ సద్గురు పాదపూజ**

# అమ్మ మాట

- జపమాలా ప్రసాద

## ప్రశ్న - సమాధానము

"సర్వాధిష్ఠాన చైతన్యస్వరూపులైన సద్గురునాధులు, కూటస్థ పరబ్రహ్మముగా ప్రకాశిస్తూ, మనందరిలోనూ ఆత్మ స్వరూపంగా, పిపీలికాది బ్రహ్మపర్యంతమూ తానే అయి ప్రకాశిస్తూ, తాము యే ఆనందాన్ని పొందుతున్నారో, దానిని మనందరికీ అందిస్తూ, వారు ఆనంద స్వరూపంగా భాసిస్తున్నారు. గురుస్థానంలో ప్రకాశిస్తున్న మహనీయులు ఎన్నడూ తమకంటూ ఏదీ దాచుకోరు. కానీ సాధకుడైనవాడు ఆసక్తితో ప్రశ్నించాలి. విచారణకు ప్రశ్న అవసరం.



గురువులని భయభక్తులతో సేవించి, పరిపూర్ణ శరణాగతితో, పరిప్రశ్న వేసిననాడు, వారు మనకి జ్ఞానాన్ని ప్రసాదిస్తారు. అలనాడు అర్జునుడు, "ఓ కృష్ణా! యుక్తాయుక్తములు, ధర్మాధర్మములు తెలియక, కార్పణ్యదోషంతో నేను చుట్టబడి, ధర్మసమ్మూఢచేతస్తుడనై నిన్ను ప్రశ్నిస్తున్నాను. నీవు నా గురువు; నేను నీ శిష్యుడిని. కనుక నన్ను ఆజ్ఞాపించు. ఏది శ్రేయస్సో దానిని నాకు ఉపదేశించు" అని వేడుకున్న మరుక్షణమే గీతాచార్యుడు సర్వోపనిషత్సారమగు భగవద్గీతని వుపదేశించాడు.

అదే విధంగా పార్వతీదేవి, పరమశివుడిని ప్రశ్నించింది. "స్వామీ! సమస్త సృష్టికి ఆధారమై, సర్వత్రా తామే ప్రకాశిస్తూ వుండగా, సమస్త దేవతలు, మునులు తమని పూజించి, నమస్కరిస్తూ వుండగా, తమరు నిరంతరం ధ్యానమగ్నులై ఎవరిని ధ్యానిస్తున్నారో, నాయందు దయయుంచి వివరించవలసిందని, పార్వతీదేవి శ్రద్ధాభక్తులతో ప్రశ్నించగా, లోకోపకారమైనది, ముందెన్నడూ ఎవరూ అడగనిదీ అయిన ఆమె ప్రశ్నకు ఎంతో సంతోషించి పరమశివుడు వివరించిన రహస్యమే "గురుగీత" రూపంలో జాలువారి, గురుభక్తులైన సాధకులకి ఎంతో ముఖ్యమైన గ్రంథంగా వెలువడింది.

ఆనాడు నైమిశారణ్యంలో శౌనకాది మహామునులు, సూత మహర్షిని ఎంతో ఆవేదనతో ప్రశించగా వెలువడినవే, మన అష్టాదశ పురాణములు, దేవీభాగవతమున్నూ. శ్రద్ధాళువులైన శిష్యుల ప్రశ్నలకి సమాధానాలే ఉపనిషత్తులన్నీను.

ఏడు రోజులలో తనకు మరణమున్నదని తెలుసుకున్న పరీక్షిన్మహారాజు, వారం రోజులలోపుగా ఆత్మజ్ఞానాన్ని ఏ విధంగా పొందగలనని తీవ్ర ఆవేదనతో శ్రీ శుకమహర్షిని ప్రశ్నించగా, శుక మహర్షి నోట వెలువడిన సమాధానమే, సమస్త జీవులనీ భవబంధ విముక్తులను చేసే శ్రీమద్భాగవతము'.

'ఏది నిత్యము? ఏది అనిత్యము? ఏది సత్యము? ఏది అసత్యము?' అని తెలుసుకొనగోరే సాధకుడికి, గురుదేవులు జ్ఞానబోధని అనుగ్రహిస్తారు. దానిని పరిపూర్ణ విశ్వాసముతో శ్రవణంచేసి, ఆచరించిననాడే ఆ సాధకుడు పరిపూర్ణ ఆనందానికి వారసుడవుతాడు. గురుమూర్తి చేసిన బోధ మనస్సుకి పట్టాలంటే, సాధకుడు ముందుగా, తన మనసులోని ఈర్ష్య, అసూయ, అసహనము, ఓర్వలేనితనము ఇత్యాది చెడుగుణాలని భగవన్నామ, ధ్యాన, సంకీర్తనలతో క్షాళన చేసుకోవాలి. అప్పడు తనలోనే మరుగున పడిపోయిన సత్య వస్తువు యొక్క దర్శనం అవుతుంది. సాధన కాలంలో ఎదురయ్యే ఒడిదుడుకు లను దీక్ష, ధైర్యంతో ఎదుర్కోవాలి. జగత్తంతకీ ఆధారమైన భగవానుడు తనలోనే వున్నాడని తెలుసుకుంటాడు. మారనటువంటి ఆనందమును, శాంతిని పొందుతాడు.

అటువంటి దివ్య జ్ఞానమును ప్రసాదించే గురుపాదుకలు, అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను ప్రసాదించి సర్వులను రక్షించుగాక! సమస్త లోకములు సుఖశాంతులతో వర్ధిల్లును గాక!"

# అశ్వనీ దేవతలు

- సన్నిధానం కాళీమాత

మన పురాణాలలో అశ్వనీదేవతలు అనేక సందర్భాలలో దర్శనం ఇస్తూ వుంటారు. ముఖ్యంగా వైద్య విషయంలో వీరు అనేక అద్భుతాలు చేశారు. నేటి మన వైద్య విధానాలలో గుండె మార్పిడి, లివర్ మార్పిడి వంటివే అద్భుతమైన ప్రక్రియలు అనుకుంటున్నాము. కానీ వీరు శిరస్సును కూడా మార్చి మనుష్యులను పునర్జీవితులను చేసిన విషయాలు మనకు పురాణాల ద్వారా తెలుస్తున్నాయి.

దధీచి మహర్షి గొప్ప తపస్వి. ఇంద్రుడు ఒకసారి ఆయన దగ్గరకు వచ్చి, 'మహర్షీ! నువ్వు గొప్ప జ్ఞానివి, మహాత్ముడవు. అయినప్పటికీ నీవు తెలుసుకోవలసిన శాస్త్ర విషయాలు కొన్ని ఉన్నాయి. అవి నీకు చెబుతాను అని చెప్పాడు. బ్రహ్మాజ్ఞాని అయిన దధీచి మహర్షి ఆయన చెబుతుండగానే విషయాలన్నీ క్షుణ్ణంగా గ్రహించాడు. అయితే ఇంద్రుడు వెళ్ళిపోతూ 'నీవు రహస్య శాస్త్ర విషయాలను ఎవరికైనా చెప్పావంటే నీ శిరస్సు వూడి క్రింద పడిపోతుంది, నీవు మరణిస్తావు. అందువల్ల ఈ శాస్త్రాలను ఎవరికీ ఉపదేశించవద్దు' అని చెప్పి వెళ్ళిపోయాడు.

అశ్వనీ దేవతలకు ఈ విషయం తెలిసి, వారు దధీచి మహర్షి దగ్గరకు వచ్చి, ఆ విషయాలను తమకు ఉపదేశించమని ప్రార్థిస్తారు. అంతేకాక వారు గతంలో దధీచి మహర్షి తండ్రియైన చ్యవన మహర్షికి, తాము ఆరోగ్యము, యవ్వనము, అనేక వైద్యపరమైన విషయాలను ప్రసాదించడం జరిగింది కనుక ఆ సంగతి గుర్తించి ప్రత్యుపకారంగా తమకు ఇంద్రుడు చెప్పిన శాస్త్రములను బోధించమని అడిగారు. అంతేకాక, ఏ శాస్త్ర పరిజ్ఞానము ఒక్కరి వద్దనే ఆగిపోరాదని, సంపూర్ణ మానవజాతికి ఉపయోగపడాలని తెలియజెప్పగా, దధీచి మహర్షి అందుకు సమ్మతమేగాని, తన శిరస్సు పడిపోయి మరణించటం సంభవిస్తుందని చెప్పాడు. అశ్వనీ దేవతలు 'ఓ మహర్షీ! మీకు ఎటువంటి అపకారమూ జరగకుండా మేము చూసుకుంటాము' అని చెప్పాక మహర్షి అంగీకరించాడు.

దేవ వైద్యులైన అశ్వనీ దేవతలు మంచి ఉపాయం ఆలోచించి, ముందుగానే దధీచి మహర్షి శిరస్సు తీసి అక్కడ ఒక గుర్రం తల అతికించి మహర్షికి ప్రాణం పోస్తారు. అప్పుడు గుర్రం తలతో వున్న దధీచి మహర్షి ఇంద్రుని ద్వారా తెలుసుకున్న శాస్త్ర విషయాలన్నీ వారికి చెప్పగానే ఆయన అశ్వ (గుర్రం) శిరస్సు క్రింద పడిపోయింది. అశ్వనీ దేవతలు తిరిగి ఆయన అశ్వ శిరస్సును యధాతథంగా

అతికించి, మహర్షిని పునర్జీవితుణ్ణి చేశారు. అంటే శస్త్ర చికిత్సలలో అద్భుతము, అత్యంత క్లిష్ట తరమైన శిరస్సును తీసి, మరల శిరస్సును అతికించి జీవింపచేయగల విద్య తెలిసినవారు అశ్వనీదేవతలు.

ఈ విషయం తెలుసుకున్న ఇంద్రుడు కోపంతో దధీచి ఆశ్రమానికి వచ్చి తపస్సు చేసుకుంటున్న మహర్షి శిరస్సును తన ఖడ్గంతో ఖండిస్తాడు. ఇటువంటి ప్రమాదము ఏదైనా జరుగుతుందేమోనని ముందే ఊహించిన అశ్వనీ దేవతలు మహర్షి తలను మళ్ళీ అతికించి ఆయనను పునర్జీవితుణ్ణి చేశారు.

దధీచి మహర్షికి అశ్వం తలని అతికించి ఉపాయంతో బ్రతికించడం వలన వారికి అశ్వనీ దేవలతలు అని పేరు వచ్చింది. మనకు అర్థం కానంత మాత్రాన పురాణంలో విజ్ఞానాన్ని తక్కువగా అంచనా వేయకూడదు. స్కాంద పురాణం, బ్రహ్మ పురాణములలో ఈ కథ చెప్పబడింది.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్ శాఖ వారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......

**సెప్టెంబర్ 2026**

**4 శుక్ర: శ్రీ కృష్ణాష్టమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

**6 ఆది: శ్రీ గురుదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

**14 సోమ: వినాయకచవితి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

**26 శని: భాద్రపద పూర్ణిమ – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

**అక్టోబర్ 2026**

**5 సోమ: శ్రీ గురుదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

**11 ఆది: శ్రీ దేవీ శరన్నవరాత్రి ప్రారంభం**

**20 మంగళ: విజయదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

**26 సోమ: ఆశ్వయుజ పూర్ణిమ – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

# భగవద్గీత సాధన దీపిక

(గత సంచిక తరువాయి) - కీ.శే. శ్రీ గూడా శివ రామమూర్తి

ఇంతవరకూ నీవు అర్జునుడిలో అతనిలోని భగవదాకాంక్షకూ, సంసారాసక్తికీ మధ్య చెలరేగిన సంఘర్షణను చూచావు. ఈ సమస్య ఆధ్యాత్మికమైనది కనుక శ్రీకృష్ణ భగవానుడు, అర్జునుడికి జగత్తును గురించి, అహంకార మమకారములను గురించి జ్ఞానాన్ని ప్రసాదించాడు. ఈ జగత్తు అసత్తు. కాని ఈ జగత్తుకు అధిష్ఠానమైనది ఏదైతే వున్నదో, దేనిమీద నీవు ఈ జగత్తును ఆరోపిస్తున్నావో, అది మాత్రం శాశ్వతంగా ఉండేది. అదే సద్వస్తువు. ఈ జగత్తు వుంటే అహంకార మమకారాలు కూడా ఉంటాయి. అందుచేత నీవు విషయాదుల నిజస్వరూపాన్ని గురించి, అవి కల్పించే వికారాలను గురించీ, జ్ఞానాన్ని సంపాదించుకో. అంతేకాని నీ మనస్సును, నీ లక్ష్యానికి దూరంగా వెళ్ళిపోనీయకు. ఈ భ్రాంతిలో పడి కొట్టుమిట్టాడుతున్న నీ మనస్సును నీవు ప్రసన్నంగా చెయ్యి. అలా ప్రసన్నమైన మనస్సులో మాత్రమే నీవు నీకే కాక జగత్తుకంతకూ మూలమైన పరబ్రహ్మమును దర్శించగలుగుతావు. నీరు నిర్మలమై, నిస్తరంగమైనప్పుడు, అడుగు భాగము, అవతలవైపు ఉన్న వస్తువులు ఎలా స్పష్టంగా కనబడతాయో, అదే విధంగా, విషయాదుల యందలి కర్తృత్వ - భోక్తృత్వాభిమానములు హరింపబడి, మనస్సు ప్రసన్నమైనప్పుడు, నీ అహానికి, జగత్తుకూ, అలాగే అన్నింటికీ మూలమైనది ఆ సచ్చిదానంద పరబ్రహ్మమే, అని నీకు తెలుస్తుంది.



ఆ సచ్చిదానంద పరబ్రహ్మమే ఈదృశ్యమానమైన జగత్తుగా భాసిస్తున్నా, ఈ జగత్తు బ్రహ్మము కాదు. జగత్తు నిజానికి సచ్చిదానందం యొక్క నామరూపాదికము మాత్రమే. ఇది అనుభవంలోకి రాకపోవటానికి కారణం నీలో ఉన్న అజ్ఞానమనే అంధకారమే. జ్ఞానోదయం అయి, అజ్ఞానం నశించగానే, నీకు ఈ సత్యం అనుభవంలోకి వస్తుంది. నీవు ఏదైనా బాగా అర్థంకాని విషయాన్ని ఎలా

ఉదాహరణలతో వివరిస్తావో, అలాగే శ్రీకృష్ణ భగవానుడు కూడ, అర్జునుడికి తాను బోధిస్తున్న ఆత్మ తత్త్వం బాగా అర్థం కావటానికి వుదాహరణను ఒక దానిని చూపెడుతున్నాడు.

22. **వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరో-పరాణి**
**తథా శరీరాణి విహాయ జీర్ణా నన్యాని సంయాతి నవాని దేహీ ॥**

శ్రీకృష్ణ భగవానుడు "అర్జునా! మనుష్యుడు జీర్ణమైన వస్త్రాన్ని విడిచి, క్రొత్త వస్త్రాన్ని ధరిస్తున్నట్లుగానే, ఆత్మ జీర్ణమైన శరీరమును విడిచి, క్రొత్త శరీరమును పొందుతున్నది" అన్నాడు.

ఉదాహరణకు నీవు ఒక చిరిగిపోయిన పాత చొక్కాని విడిచేసి క్రొత్త చొక్కాను వేసుకున్నావనుకో, దాని వల్ల ఏం నష్టం కలిగింది? ఏమీ లేదు. అదే విధంగా, దేహి ఒక దేహాన్ని విడిచి ఇంకొక దేహాన్ని ధరిస్తున్నాడు. దీనివల్ల దేహికి ఏమీ కావటం లేదు.

దేహి ఎప్పుడూ అలాగే నిత్యుడుగా, మార్పులేని వాడుగా, వుండనే వున్నాడు. ఈ విధంగా ఒక జీర్ణదేహాన్ని విడిచి మరొక క్రొత్త దేహాన్ని తిరిగి ధరిస్తున్నది ఎవరోకాదు. సచ్చిదానంద పరబ్రహ్మము అని పిలువబడుతున్న పురుషోత్తముడే. నీవు దీనిని తెలుసుకొని ఈ ఎఱుకను నిశ్చలచిత్తంతో, అచంచలమైన విశ్వాసంతో ధ్యానించాలి.

నీకు ఇంతవరకు ఏ విధమైన ఆధ్యాత్మిక అనుభవాలూ కలిగి ఉండకపోవచ్చు. అయినా నీవు జ్ఞానులైన మన ఋషుల యొక్క, ద్రష్టల యొక్క అనుభవాన్ని పంచుకొని, వారి అనుభవమునందు దృఢమైన విశ్వాసం ఉంచి, ఇదంతా భగవంతుడి లీల అని, నీవు నిమిత్తమాత్రుడివి అని త్రికరణ శుద్ధిగా నమ్మి, స్వధర్మాచరణం చేస్తూ నీ సాధనను కొనసాగిస్తే, నీ మనస్సు ప్రసన్నమై, ఆత్మానుభూతి కలుగుతుంది. ఆ పరబ్రహ్మము జగత్తుకంతటికి ఎలా ఆధారమై ఉన్నాడో అలాగే నీకు కూడ అధిష్ఠానంగా ఉన్న సత్యాన్ని గ్రహించగలుగుతావు.

- సశేషం

# రామస్యదూతమసకృన్నమామి

(గత సంచిక తరువాయి) - భాగవతుల హనుమత్ జయప్రద


( సుందరకాండ – సర్గ 1 )

సుందరకాండ ప్రథమ శ్లోకమైన "**తతో రావణనీతాయాః**..." ద్వారా హనుమంతుని మహోన్నత సంకల్పాన్ని తెలుసుకున్నాం.

సీతాదేవి ఎక్కడ ఉందో తెలియదు. ఆమెను చేరే మార్గం ఎంత కష్టమో తెలియదు. విజయం లభిస్తుందో లేదో కూడా తెలియదు. అయినప్పటికీ, "**ఇయేష పదమన్వేష్టుం**" – లక్ష్యం నెరవేరే వరకు వెతకడమే తన కర్తవ్యమని భావించి హనుమంతుడు ముందుకు సాగాడు అని తెల్సుకున్నాము.

ఈ సంచికలో ..

**దుష్కరం నిష్ప్రతిద్వంద్వం చికీర్షన్ కర్మ వానరః।**
**సముదగ్రశిరోగ్రీవో గవాం పతిరివాబభౌ ॥శ్లోకము 2॥**



అత్యంత కష్టమైన కార్యాన్ని చేయాలని దృఢ నిశ్చయంతో నిలిచిన హనుమంతుడు, తన తలను, మెడను ధైర్యంగా పైకెత్తి, గోవుల మందలోని బలశాలియైన వృషభంలా తేజోవంతంగా కనిపించాడు. ఇక్కడ వాల్మీకి మహర్షి ఒక అద్భుతమైన విషయాన్ని చెబుతున్నారు. హనుమంతుడు ఇంకా సముద్రాన్ని దాటలేదు. సీతాదేవిని కూడా కనుగొనలేదు. అయినప్పటికీ, ఆయన ముఖంలో భయం లేదు; ఆందోళన లేదు. ఎందుకంటే, బాహ్య విజయానికి ముందు మనస్సులో విజయం పుడుతుంది. హనుమంతుడు కూడా సముద్రాన్ని ఒక అడ్డంకిగా చూడలేదు. రామకార్యానికి మధ్యలో ఉన్న ఒక దూరంగా మాత్రమే చూశాడు.అందుకే వాల్మీకి మహర్షి "దుష్కరం" అని ముందుగా చెప్పినా, హనుమంతుని ముఖంలో భయం కాక తేజస్సును వర్ణించారు. ఎందుకంటే కష్టం మారలేదు. కష్టాన్ని చూసే హనుమంతుని దృష్టి మారింది.

ఆయన ఎక్కిన పర్వతంమీద రంగు రంగుల రాళ్ళు మనోహరంగా ఉన్నాయి. ఆ పర్వత సానువుల మీద చీని చీనాంబర ధారులయిన కామరూపులు యక్ష, కిన్నర, గంధర్వ, నాగజాతులవారు యథేచ్ఛగా విహరిస్తున్నారు. హనుమంతుడు సూర్యునికీ, దేవేంద్రునికీ, బ్రహ్మదేవునికీ చేతులు జోడించి స్మరించి తూర్పుగా తిరిగి తన జనకుడయిన వాయుదేవునికి ప్రణామాలర్పించి, దక్షిణ దిశగా తిరిగి ప్రయాణోన్ముఖుడై శరీరాన్ని పెంచడం ఆరంభించాడు. పర్వదినాలలో సముద్రంవలె ఆ శరీరం పొంగుతున్నది. దేహాన్ని పెంచి పెంచి ఒక్కసారి పాదాలతో పర్వతాన్ని కదిలించాడు. ఆ ఊపుకి పర్వతం మీది చెట్ల పువ్వులన్నీ జలజల రాలాయి. పూలజల్లులతో నిండిన

ఆ గిరి పుష్పగిరిలా ఉంది. ఆ తాకిడికి పర్వతం పగుళ్ళిచ్చి నీటి ఊటలుబికాయి. కొండ గుహలలో విశ్రాంతి తీసుకునే మృగాలు భయభ్రాంతులయ్యాయి. ప్రశాంతంగా ప్రేయసీజనంతో విహరించే విద్యాధరులు ఈ రణగొణ ధ్వనికీ, ప్రకంపనాలకూ జంకి ఎలా వున్నవారు అలానే గగన వీధికి ఎగిరి పోయారు. వారు పానంచేసే సువర్ణ పాత్రలనూ, బంగారు కుండలనూ, వివిధ మాంసాహారాలనూ ఎక్కడివక్కడే విడిచి ఎర్రపడిన కనులతో ఆకాశ మార్గం చేరారు. వారికి కొంచెం పైభాగాన వున్న సిద్ధులూ, మహర్షులూ, ఆ దృశ్యాన్ని చూసి "ఓహో! పర్వత సమదేహుడయిన హనుమంతుడు రామ కార్యార్థియై భీకరమయిన సముద్రం దాటడానికి సంకల్పించాడు" అని అనుకున్నారు.

హనుమంతుడు ఒక్కసారి తన దేహాన్ని విదలించగా రోమ రోమం కదలింది. ఒక్క సింహనాదం చేశాడు. కారుమేఘం ఉరిమినట్లుంది. తన వాలాన్ని మరింత దీర్ఘంగా పొడిగించాడు. నేలకు ఆని కూర్చున్నాడు. చేతులు ముడిచాడు; కంఠం వుగ్గబట్టాడు. బల, పరాక్రమ, సామర్థ్యాలను కేంద్రీకరించాడు. ప్రాణాన్ని హృదయంలో నిర్బంధించాడు. ఆకాశంలోకి చూపు పోనిచ్చాడు. చెవులు ముకుళించాడు. పాదాలు తొక్కిపట్టాడు. లేవబోతూ, లేవబోతూ తన స్నేహితుల వైపు తిరిగి: – "వాయు వేగంతో సాగే రామబాణంలా లంకానగరానికి వెడతాను. అక్కడ సీతాదేవి కనిపించకపోతే దేవలోకానికి వెడతాను. అక్కడా అమ్మవారు లేకపోతే తిరిగి లంకచేరి రావణుని బంధించి తెస్తాను. రావణ సమేతంగా లంకను పెళ్ళగించి తీసుకు వస్తాను" అని అంటూ ఒక్క ఊపులో పైకి ఎగిరాడు. ఆ క్షణంలో ఆయన గరుత్మంతునివలె వున్నాడు.

బారసాచిన చేతులు అయిదు పడగల పాముల్లా ఉన్నాయి. చూస్తూంటే ఆ మహాకపి ఆకాశాన్ని కబళించి, సాగరాన్ని ఔపోసనం పట్టేలా ఉన్నాడు. ఎరుపెక్కిన కన్నులు పర్వతంమీద అగ్నిగోళాలవలె ఉన్నాయి. ఉదయించే సమయంలో చంద్ర, సూర్యబింబాలవలె కనిపిస్తున్నాయి ఆ కన్నులు. ఆ వాలం ఇంద్రధ్వజంలా ఉంది. ఆయన ముందుకు సాగుతూంటే ఆ వాయువేగానికి సముద్రం అల్లకల్లోలమవుతున్నది. హనుమంతుని తీవ్రగమనాన్ని తిలకించి దేవ, గంధర్వగణాలు పూలవాన కురిపించాయి. ప్రయాణంలో వాయువు సహకరించాడు. సూర్యుడు చల్లచల్లగా ఉన్నాడు. గగన సంచారులెందరో ప్రశంసావర్షం కురిపించారు.

శ్రీ ఆదిశంకర భగవత్పాదులు శివానందలహరి లో

**మనస్తే పాదాబ్జే నివసతు వచః స్తోత్రఫణితౌ ।**

**కరశ్చాభ్యర్చాయాం శ్రుతిరపి కథాకర్ణనవిధౌ ।**

**తవ ధ్యానే బుద్ధిర్నయనయుగళం మూర్తివిభవే ।**

**పరగ్రంథాన్ కైర్వా పరమశివ జానే పరమతః ॥**– అని స్తుతించారు.

అంటే – “ఓ పరమశివా! నా మనస్సు నీ పాదపద్మాలపై నిలవాలి. నా వాక్కు నిన్నే స్తుతించాలి. నా చేతులు నిన్నే అర్చించాలి. నా చెవులు నీ కథలను మాత్రమే వినాలి. నా బుద్ధి నీ ధ్యానంలో నిలవాలి. నా నేత్రాలు నీ దివ్యమూర్తిని మాత్రమే దర్శించాలి.”

హనుమంతుని ఆ క్షణం కూడా ఇలాగే ఉంది. ఆయన మనస్సు శ్రీరాముని కార్యంలో నిలిచింది. చేతులు కార్యసిద్ధికి సిద్ధమయ్యాయి. చూపు లక్ష్యంపై నిలిచింది. ప్రాణశక్తి హృదయంలో కేంద్రీకృతమైంది. శరీరంలోని ప్రతి అవయవం ఒక్క దిశగా, ధ్యేయం వైపు కదిలింది.

ఇక్ష్వాకు వంశీయులయిన సగరులవల్ల వృద్ధిపొందిన సాగరుడు ఆ హనుమంతునికి ఏదోవిధంగా సహాయపడడం తన కృతజ్ఞతకు అవకాశంగా భావించాడు. ఈ సాహసయాత్రలో హనుమంతునికి కొంత విశ్రాంతి యివ్వగలిగితే మరింత సుఖంగా సముద్రం ఆవలి ఒడ్డును చేరగలడనుకున్నాడు. తనలో మునిగి వున్న హిరణ్యనాభుడయిన మైనాకుని పిలిచి, “పాతాళం లోని రాక్షసులు వెలుపలకు రాకుండా దేవేంద్రుడు నిన్నిక్కడ అడ్డుగా ఉంచాడు. ఇప్పుడు నువ్వు కామరూపశక్తితో పైకి పెరిగితే నీకూ, నాకు ఎంతో మేలు కలుగుతుంది. ఇక్ష్వాకు వంశీయుడయిన శ్రీరామచంద్రునికి సేవా ధర్మంతో హనుమంతుడు వెడుతున్నాడు. నువ్వు పైకి పెరిగితే కొంతసేపు విశ్రాంతి తీసుకుంటాడు. ఆలస్యం చెయ్యకు. ఆయనకు ఆతిథ్యం ఇచ్చి మన కర్తవ్యం మనం నిర్వర్తించి పెద్దల మన్ననలు పొందుదాం” అని అన్నాడు.

- సశేషం


## సమర్థ సద్గురు మాసపత్రిక వారి విన్నపము

ఉదార దాతల సహకారంతో గత కొన్ని సంవత్సరాలుగా సమర్థ సద్గురు తెలుగు మాసపత్రిక తెలుగు రాష్ట్రాలలోని అనేక గ్రంథాలయాలకు చేరుతూ, అనేక మంది పాఠకులకు జ్ఞానసేవ అందిస్తోంది. ఈ గ్రంథాలయ చందాలలో చాలావాటి గడువు త్వరలో ముగియనున్నందున, ఈ సేవ నిరంతరాయంగా కొనసాగేందుకు భక్తులు, పాఠకులు విరాళాలతో ముందుకు రావలసిందిగా మనవి.

అలాగే, పుట్టినరోజులు, వివాహాలు, వివాహ వార్షికోత్సవాలు, గృహప్రవేశాలు వంటి శుభ సందర్భాలలో మీ బంధుమిత్రులకు బహుమతి చందాలు (Gift Subscriptions) అందించి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచండి.

మీ సహకారం అనేక మంది పాఠకులకు జ్ఞానదీపంగా నిలుస్తుంది. ఈ సేవకు సంబంధించిన వివరాల కోసం: 8333808310.

## అహింసా భావము

సేకరణ - మురళి

గౌతముడిలో చిన్నతనం నుంచే అహింసా భావం ఉండేది. ఒకరోజు, అతని దాయాది దేవదత్తుడు ఒక పక్షిని బాణంతో కొట్టాడు. ఆ అల్పజీవి గాయపడి నేలపై పడిపోయింది. గౌతముడు పరుగున ముందుకు వెళ్ళి, దానిని చేతుల్లోకి తీసుకున్నాడు. దానిని దేవదత్తునికి ఇవ్వడానికి నిరాకరించాడు. ఈ వివాదం రాజగురువు ముందుకు వెళ్ళింది, అయితే ఆయన గౌతముడికి అనుకూలంగా తీర్పు ఇచ్చారు.

తన సంచారంలో, ఒకరోజు గౌతముడు ఒక ఇరుకైన లోయ గుండా వెడుతున్న మేకలు, గొర్రెల మందను చూశాడు. ఆ మందలోని జీవులు దారి తప్పిపోకుండా ఉండేందుకు కాపరి అప్పుడప్పుడు అరుస్తూ, ముందుకు వెనుకకు పరుగెత్తుతున్నాడు. ఆ భారీ మందలో గౌతముడు ఒక చిన్న గొర్రె పిల్లను చూశాడు. అది శరీరంపై ఒకచోట గాయమై, కాపరి కొట్టిన దెబ్బకు కుంటుతూ, వెనుకబడి కష్టపడుతూ నడుస్తోంది. గౌతముడి హృదయం ద్రవించింది, ఆయన దానిని ఎత్తుకుని మోస్తూ "పర్వత శిఖరాలపై లేదా ఏకాంత గుహలలో కూర్చుని మానవాళి కష్టాలను, బాధలను పట్టించుకోకుండా చూడటం కంటే, ఒక అమాయక జీవి యొక్క బాధను నివారించడం చాలా ఉత్తమం" అనుకున్నాడు. ఆపై, కాపరి వైపు తిరిగి, "మిత్రమా, ఇంత పెద్ద మందతో అంత తొందరగా ఎక్కడికి వెళ్తున్నావు?" అని అడిగాడు. "రాజుగారి కోటకి" అని కాపరి చెప్పాడు, "దేవతలను ప్రసన్నం చేసుకోవడం కోసం మా మహారాజు ఈ రాత్రి ప్రారంభించబోయే యజ్ఞంలో బలి ఇవ్వడానికి మేకలను, గొర్రెలను తీసుకురమ్మని మమ్మల్ని పంపారు." ఇది విన్న గౌతముడు ఆ గొర్రె పిల్లను చేతుల్లో పట్టుకుని కాపరి వెనుక నడిచాడు.

వారు నగరంలోకి ప్రవేశించినప్పుడు, రాజుగారు ఆదేశించిన బలి పశువులను ఒక పవిత్ర సన్యాసి తీసుకువచ్చారనే వార్త అంతటా వ్యాపించింది. గౌతముడు వీధుల గుండా వెళుతుండగా, కాషాయ వస్త్రాలు ధరించిన ఆ యువకుడి దయామయ, పవిత్ర, తేజోవంతమైన రూపాన్ని చూడటానికి ప్రజలు బయటకు వచ్చారు. ఆయన గంభీరమైన రూపం, మధురమైన ముఖ కవళికలను చూసి అందరూ ఆశ్చర్యానికి, గౌరవభావానికి లోనయ్యారు. యజ్ఞానికి ఒక పవిత్రమైన వ్యక్తి వస్తున్నట్లు రాజుకు కూడా సమాచారం అందింది. రాజు సమక్షంలో పూజా కార్యక్రమాలు ప్రారంభమైనప్పుడు, బలి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న ఒక మేకను అక్కడికి తీసుకువచ్చారు. కాళ్ళు కట్టేసి ఉన్న ఆ మూగ జీవి గొంతు కోయడానికి, చేతిలో పెద్ద కత్తితో ప్రధాన పూజారి సిద్ధంగా నిలబడ్డాడు.

ఆ విషాదకరమైన క్షణంలో, గౌతముడు ముందుకు వచ్చి, "ఓ రాజా, ఈ క్రూరమైన పనిని ఆపండి!" అని బిగ్గరగా అరిచాడు. అలా చెప్తూనే, ఆయన ముందుకు

వంగి బలి పశువు కట్లను విప్పేసాడు. “ప్రతి మనిషి తన ప్రాణాన్ని కాపాడుకోవడానికి ఎలా ఇష్టపడతాడో, అలాగే ప్రతి జీవి జీవించడానికి ఇష్టపడుతుంది” అని ఆయన అన్నాడు. అప్పుడు ఆ పూజారి పశ్చాత్తాపం చెందిన పాపిలా కత్తిని విసిరేశాడు. రాజు కూడ పశ్చాత్తాపముతో జంతు బలిని విరమింపజేశాడు. మరుసటి రోజు రాజు తన రాజ్యం అంతటా ఒక రాజశాసనాన్ని జారీ చేశాడు, దాని ప్రకారం భవిష్యత్తులో ఇకపై ఎలాంటి బలులు ఇవ్వకూడదని, ప్రజలందరూ పక్షులు, జంతువుల పట్ల సమానంగా దయ చూపాలని ఆదేశించాడు.

ఒకరోజు బుద్ధుడు చేతిలో భిక్షాపాత్ర పట్టుకుని ఒక ఐశ్వర్యవంతుడైన బ్రాహ్మణుడి ఇంటికి వెళ్ళాడు. ఆ బ్రాహ్మణుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ “ఓ భిక్షువా! ఇలా ఇళ్ళూ, ఊళ్ళూ తిరుగుతూ, భిక్షమెత్తుకుంటూ సోమరిగా జీవితాన్ని ఎందుకు గడుపుతున్నావు? ఇది అవమానకరం కాదా? నీకు మంచి బలమైన శరీరం ఉంది. నువ్వు పని చేసుకోవచ్చు. నేను పొలం దున్నుతాను, విత్తనాలు చల్లుతాను. పొలాల్లో కష్టపడి, నా నుదుటి చెమటను కార్చి నా అన్నాన్ని నేను సంపాదించుకుంటాను. నేను కష్టపడి జీవిస్తాను. నువ్వు కూడా పొలం దున్ని, విత్తనాలు చల్లుకుంటే నీకు తినడానికి బోలెడంత ఆహారం దొరుకుతుంది, అది చాలా మంచిది” అన్నాడు. దానికి బుద్ధుడు, “ఓ బ్రాహ్మణా! నేను కూడా పొలం దున్నుతాను, విత్తనాలు చల్లుతాను; అలా దున్ని, చల్లిన తర్వాతే నేను తింటాను” అని ప్రత్యుత్తరమిచ్చాడు. ఆ బ్రాహ్మణుడు, “నువ్వు వ్యవసాయదారుడిని అని చెప్పుకుంటున్నావు, కానీ నాకు అందుకు సంబంధించిన ఎటువంటి ఆనవాళ్ళు కనిపించడం లేదు. అసలు నీ నాగలి, ఎద్దులు మరియు విత్తనాలు ఎక్కడ ఉన్నాయి?” అని అడిగాడు.

అప్పుడు బుద్ధుడు “ఓ బ్రాహ్మణా! నా మాటలను శ్రద్ధగా విను. నేను ‘విశ్వాసం’ (శ్రద్ధ) అనే విత్తనాన్ని  చల్లుతాను. నేను చేసే ‘సత్కార్యాలు’  ఆ విత్తనాలకు నీరు పోసే వర్షం లాంటివి. ‘వివేకం మరియు వైరాగ్యం’ నా నాగలి యొక్క భాగాలు. ‘ధర్మం’ దానిని పట్టుకునే చిడుత.  ‘ధ్యానం’ అనేది ఎద్దులను అదుపు చేసే ముల్లుకర్ర. ‘శమము మరియు దమము’ – అంటే మనశ్శాంతి మరియు ఇంద్రియ నిగ్రహం – నా ఎద్దులు. ఈ విధంగా నేను మనస్సు అనే నేలను దున్ని, అనుమానం, భ్రాంతి, భయం, పుట్టుక మరియు చావు అనే కలుపు మొక్కలను తొలగిస్తాను. దీని ద్వారా వచ్చే పసిడి పంటే ‘నిర్వాణం’ అనే అమర ఫలం. ఈ రకమైన దున్నడం మరియు కోత ద్వారా సమస్త దుఃఖాలు అంతమైపోతాయి” అని సమాధానమిచ్చాడు. ధనవంతుడు, అహంకారి అయిన ఆ బ్రాహ్మణుడికి జ్ఞానోదయమై  కళ్ళు తెరుచుకున్నాయి. ఆయన బుద్ధుని పాదాలపై పడి నమస్కరించి, ఆయనకు గృహస్థ శిష్యుడిగా మారాడు.

- సశేషం

# శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారి సహస్ర నామావళిః

(గత సంచిక తరువాయి)

-పాలూరి ప్రసాద్

**170. ఓం పూతాన్వయ సముద్భవాయ నమః**

సదాశివుడు మొదలుగా ఆదిశంకరులు తదితరులు అవతరించిన గురు పరంపరలో, అట్టి పరమ పావనమైన 'గురువంశము' నకు ప్రతీకగా, నిత్య సత్యమైన, సర్వవేదసారమైన పరబ్రహ్మ తత్త్వమును సర్వజీవకోటికి తెలియబరచుటకై ఉద్భవించిన వారు శ్రీగురుదేవులు. భౌతికపరముగా శ్రీగురుదేవుల వంటి బ్రహ్మణ్యుల కారణ దేహమునకు జన్మనిచ్చిన వంశంలో అటు ఏడు తరాలు, యిటు యేడు తరాలూ తరించాయి అని భావము.

**171. ఓం గాన ప్రియాయ నమః**

శ్రీ గురుదేవులు గాన ప్రియులు. అనగా కలియుగమందు అత్యంత తేలికగా ఆత్మానందాన్ని ప్రసాదించి, భగవత్సాయుజ్యాన్ని ప్రసాదించే భక్తి రస ప్లావితమైన సంగీతమంటే శ్రీగురుదేవులకు అమితమైన ప్రీతి. పరమ భక్తులై ఆ భగవంతుని ఆర్తితో కీర్తించెడి భక్తుల ముఖము నుండి వెలువడే ప్రణవనాదాన్ని ఆలకించటానికి వారు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు.

**172. ఓం జగద్గేయాయ నమః**

ఈ జగత్తు శ్రీగురుదేవుల చేత రచించబడ్డ ఒక చక్కటి గేయం. సృష్టి, స్థితి, లయములు అందలి చరణములు. వాటిలో అంతర్లీనమైయున్న పల్లవియే పరమాత్మ. పల్లవి లేని చరణాలకు ఉనికి లేదు. చరణాలు లేని పల్లవికి గుర్తింపులేదు. అలాంటి అద్భుతమైన ఈ జగత్తనే గేయాన్ని రచించిన మహాకవి శ్రీ గురుదేవులు.

**173. ఓం అనూన ప్రభావ మేదురాయ నమః**

శ్రీ గురుదేవులు ఈ జగత్తులోని అందరికంటే, అన్నిటికంటే మహా మహిమాన్వితమైన ప్రభావము కలవారు. ఈ విశ్వమంతా వారి యొక్క ప్రభావము వలననే మనగలుగుచున్నది.

**174. ఓం మానితాంఘ్రి ద్వయాయ నమః**

సకల పుణ్యతీర్థములకు నిలయమైన శ్రీగురుపాదపద్మములు సదా పూజనీయములు. వారి పాద పద్మములను పూజించనిదే మనము ఈ సంసార సాగరాన్ని దాటలేము. ఆ పాద పద్మములలో ఒకటి మన అంహంకారాన్ని, రెండవది మమకారాన్ని

హరిస్తాయి. ఈ సంసార సాగరాన్ని తరించటానికి శ్రీగురుదేవులయందు విశ్వాసమనే నావను అధిరోహించి ఆ నావకు నావికుడైన గురుదేవులకు సంపూర్ణ శరణాగతి చెందినపుడు వారు నావను నడిపి మనను ఆవలి ఒడ్డుకు చేరుస్తారు.

**175. ఓం భక్తి జ్ఞాన వైరాగ్య దాయకాయ నమః**

అజ్ఞానమనే దట్టమైన చీకటి పరచుకొని, సంకల్పాలనే బీజాలనుండి వుధ్భవించిన మహావృక్షాలతో నిండి, అహంకార మమకారాలు వాసనలు అనే క్రూర జంతువులతో భయంకరమై, కామ క్రోధాది చోరులచే ఆక్రమింపబడి వున్న ఈ సంసారమనే ఘోరారణ్యాన్ని దాటటానికి మనకు కావలసిన అతి ముఖ్యమైనవి భక్తి అనే కవచము, వైరాగ్యమనే ఖడ్గము మరియు జ్ఞానమనే కాగడా ఇచ్చే కాంతి. మనకు ఈ మూడింటిని ప్రసాదించగలిగినది శ్రీగురుదేవులొక్కరే.

**176. ఓం ధర్మాయ నమః**

శ్రీగురుదేవులు ధర్మ స్వరూపులు. మనము ఏది ధర్మము, ఏది అధర్మము, ఏది పుణ్యము, ఏది పాపము అనే మీమాంసను వదలివేసి శ్రీగురుదేవులను సంపూర్ణ శరణాగతి పొందిననాడు వారు మనను సర్వ పాపములనుండి విముక్తులను చేసి మోక్షాన్ని ప్రసాదిస్తారు. ఇందులో ఎటువంటి సందేహానికి తావు లేదు.

**177. ఓం ధర్మప్రదాయ నమః**

శ్రీ గురుదేవులు సర్వ ధర్మములను ఎఱిగిన వారు. అందువలన తమను ఆశ్రయించిన వారిలో ఎవరెవరు ఏ ఏ ధర్మములు ఆచరించితే వారికి శ్రేయస్సు కలుగుతుందో వారికి ఆయా ధర్మములను శ్రీగురుదేవులే ప్రసాదిస్తారు. ఎవరికి అనుగ్రహించిన ధర్మాన్ని వారు తు.చ.తప్పక ఆచరించుటయే మోక్షానికి మార్గము.

**178. ఓం యుక్త కర్మాయ నమః**

శ్రీగురుదేవులు తాము ఎప్పుడు ఎక్కడ ఏ ఏ పనులు చేస్తే తమ శిష్యులు వుద్ధరింపబడతారో అటువంటి యుక్తమైన కర్మలను ఆయా సమయములందు చేయగల సమర్థులు. వారు చేసే కర్మలన్నీ భక్త జనోద్ధరణ కొరకే.

**179. ఓం కర్మ ఫల ప్రదాయ నమః**

మనము చేసే కర్మలన్నిటికీ శ్రీగురుదేవులే ఫల ప్రదాత. మనము ఏ కర్మలను ఆచరించినా ఒక్కసారి శ్రీగురుదేవులను మనసులో స్మరించి ఆచరిస్తే ఆ కర్మలకు తప్పక సత్ఫలితాలు కలుగుతాయి. అయితే ఫలాన్ని ఆశించకుండా కర్మలను చేయటం సాధన చేసిననాడు శ్రీగురుదేవులు మనకు ఈ జన్మ కర్మ పరంపర నుండి ముక్తిని ప్రసాదిస్తారు.


- సశేషం

# శ్యామ సుందరా! ఒక్కసారి,
# ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ!

(గత సంచిక తరువాయి)

- కీ.శే. రమణ ప్రసాద్

అర్జునుడు గవాక్షం దగ్గర నిలబడి బయటకు చూస్తున్నాడు. పాలపుంతలోని నక్షత్రాల సమూహం ఈ బ్రహ్మాండాన్నంతా నిరపేక్షభావంతో చూస్తునట్లున్నది. కృష్ణుడు ఇక ఈ భూమిమీద లేడు. అయినా ప్రకృతి దానికి ఏ విధంగాను స్పందించటం లేదు. కృష్ణుడు లేకపోయినా నక్షత్రాలు మౌనంగా ఏవో సంకేతాలతో భాషిస్తూనే వున్నాయి. కృష్ణుడు ఉన్నప్పుడు కూడా ఆ మౌన సంకేతాల భాష నడుస్తూనే ఉండి ఉంటుంది. కృష్ణుడు లేకపోయినా పాలపుంతకు అది అసలు పట్టినట్లే లేదు. అది ఏమీ జరగనట్లే మామూలుగా ఉన్నది. బహుశా ఈ నక్షత్రాలు అనాదిగా అసంఖ్యాకమైన బ్రహ్మాండాల చుట్టూ వ్యాపించిన శూన్యాన్ని చూస్తూ, నిర్లిప్తంగా జీవించటం నేర్చుకొన్నాయా! ద్వాపరంలో ఈ మహాపురుషుడు ఉద్భవించినట్లు, ఇతర యుగాలలో కూడా ఎందరో మహాపురుషులు ఉద్భవించి ఉంటారు. ఈ నక్షత్రాలు వారి ఉదయాస్తమయాలన్నిటిని సాక్షిమాత్రంగా చూస్తూ చూస్తూ చివరికి ఏవిధంగానూ స్పందించని జడస్థితికి చేరుకొన్నట్లున్నాయి.



అప్పుడే ఒక ఉల్క ఆకాశాన్నంతా కోటి సూర్యప్రభలతో వెలిగిస్తున్న తేజఃపుంజంవంటి పొడుగాటి తోకతో ఆకాశం నుండి భూమివైపు దూసుకొచ్చింది. కొద్ది క్షణాలసేపు మాత్రం అలా వెలిగి ఆ ఉల్క చీకటిలో కలిసిపోయింది. ప్రకృతి క్రమము ఇదే కదా! అర్జునుడు ఆలోచిస్తూ ఆ ఉల్క రాలినవైపే చూస్తూ ఉండిపోయాడు.

హస్తినాపురం నుండి ద్వారకకు చేసిన సుదీర్ఘ ప్రయాణం ఎంతో బడలిక కలిగించినా అర్జునుడి కనులకు నిద్రరావటం లేదు. ఇంకా ఒక జాము మిగిలి వుంది. వసుదేవుడు యోగసమాధిలోకి వెళతాడు. దేవకీమాత కూడా సమాధి గతుడైన తన పతిని అనుసరిస్తుంది. ఇందులో ఏ సందేహమూ లేదు. వారి అంతిమ సందేశాన్ని వినిపించటానికి తాను శ్రీకృష్ణుణ్ణి వెతకాలి. సత్యభామ సందేశాన్ని అందించడానికి కృష్ణుణ్ణి వెతికి పట్టుకోవాలి. తండ్రి వసుదేవుడు, తల్లి దేవకి, పట్టమహిషి రుక్మిణి, ప్రాణప్రియ సత్యభామ వారందరూ, అర్జునుడు ఎలాఅయినా తమ హృదయాలలో వున్న మాటలను కృష్ణునికి తప్పకుండా అందిస్తాడు అనే సంపూర్ణ విశ్వాసంతోటే ప్రాణాలు

నిలుపుకొని ఉన్నారు. అర్జునుడు తప్ప ఈ పనిని వేరెవరూ చేయలేరు. కృష్ణుని అంతిమ యాత్ర ఈ పార్థివమైన సృష్టితో ముడిపడి ఉన్నది కదా! అర్జునుడు ఇంకా పూర్వంవలెనే కృష్ణుణ్ణి అనుసరిస్తూ కృష్ణుడికి  సన్నిహితంగానే ఉన్నాడు.

కానీ ఈ స్వజనులంతా ఎంతటి భ్రమలో జీవిస్తున్నారో! అర్జునుడు శ్రీకృష్ణుణ్ణి కలుసుకోగలుగుతాడా! కాని అర్జునుడు ఇవన్నీ బయటకి ఎలా చెప్పుకోగలడు? ఎవరికైనా ఎలా చెప్పగలడు? ఎవరు తమ అంతిమ క్షణాలు ఎప్పుడా అని లెక్కపెట్టు కొంటున్నారో వారి నమ్మకాలను తాను ఎలా వమ్ము చేయగలడు? వారి ఆశలను వమ్ముచేసినందువలన తనకు ఒరిగేదేమిటి? తాను సాధించేదేమిటి? ఈ ఆలోచనలలో చిక్కుకొన్న అర్జునుడు ఒక్కడే ఒంటరిగా నిలబడి ఉన్నాడు.

కృష్ణుడితో తాను ఆ కక్ష్యలో గడిపిన ఎన్నో రోజుల నాటి మధుర స్మృతులను జ్ఞాపకం చేసికొంటున్నాడు. ఈ క్షక్ష్యలోనే... ఇక్కడే... తాను నిల్చొని ఉంటే, అక్కడే ఆ స్థలంలోనే కృష్ణుడు కూర్చుని తనతో ఎన్నో విషయాలు మాట్లాడాడు. ఆ రోజులు! ఆ మాటలు ఇంక ఎక్కడ? ఆ రోజులు మళ్ళీ వస్తాయా?

గుమ్మానికి ముందుగా ఒక పెద్ద రాతితో మలచిన ఆసనం ఉంది. అది ఒక పెద్ద మంచం పరిమాణంలో ఉన్నది. 'దానిమీద కృష్ణుడు సుదర్శన చక్రం ధరించి కుర్చొనే వాడు. ఇప్పుడు ఆయన అక్కడ లేడు' అని దారుకుడు చెబుతున్నాడు. 'సవ్యసాచీ! ఆయన సుదర్శన చక్రం ప్రభాస క్షేత్రంలోని సభామండపంపైన వ్యాపించి అదృశ్యమవటం అందరూ చూశారు 'సుదర్శనం ఈవిధంగా అదృశ్యమవటంలోని సంకేతం యాదవులకు అర్థం కాలేదు. కాని కాలం? ఆ కాలం ఆయనను తన వశం చేసుకున్నది కదా!'

విశ్వంలోని ఏ ప్రచండమైన శక్తీ కృష్ణుని చేతినుండి దానిని తీసికోలేదు, శ్రీకృష్ణుడే స్వయంగా దానిని పంపించివేసి ఉంటాడు. కానీ యాదవులు, దారుకుడు అర్థం చేసికోని ఈ విషయాన్ని అర్జునుడు స్పష్టంగా గ్రహించాడు!

'ధనంజయా!' దారుకుడు ఇంకా చెప్పసాగాడు. 'సముద్రతటం పైన సమాధిస్థితుడైన బలరాముని దేహం నుండి ప్రచండమైన శేషనాగు వెలువడింది. ప్రభాసక్షేత్రంపైన, సముద్రతటంపైన, అనంతాకాశంపైన నిండినట్లుగా ఉంది. ఆ దృశ్యమంతా. కాని... కాని వీటన్నిటి మధ్య కృష్ణుడెక్కడ? ఇప్పుడుకూడా ప్రభాసక్షేత్రంలో ఎక్కడో సమాధినిష్ఠుడై ఉండాలి. లేక దేహ విలయం తరువాత పంచమహాభూతాలూ....'

అర్జునుడు కంపించిపోయాడు.

- సశేషం

# నారద భక్తి సూత్రములు

(గత సంచిక తరువాయి)

- వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

భక్తి సూత్రము 65: **తదర్పితాఖిలాచారః సన్ కామ క్రోధ అభిమానాదికం తస్మిన్నేవ కరణీయం.**



తాత్పర్యము: భక్తుడు తన సమస్త కర్మలను భగవంతునికి అర్పించిన తరువాత, తనలో సహజంగా ఉద్భవించే కామం, క్రోధం, అభిమానం మొదలైన భావాలను కూడా భగవంతుని వైపే మళ్లించాలి.

ఈ సూత్రం భక్తి మార్గంలో వున్న సాధకుడు సహజంగా ఉద్భవించే భావాలను బలవంతంగా అణచి వేయడం కంటే, వాటి దిశను పవిత్రంగా మార్చడం ముఖ్యమని తెలియజేస్తుంది. ఆ భావాలను లోక వ్యవహారాల వైపు మళ్ళిస్తే బంధనానికి కారణమవుతాయి; అవే భగవంతుని వైపు మళ్ళితే సాధనకు శక్తులుగా మారుతాయి. కామక్రోధాదులను యథాతథంగా సమర్థించడం కాక వాటిని భగవత్ప్రేమ, సేవ, స్మరణ, శరణాగతి వైపు పరివర్తన చేయడమే ఈ సూత్రం యొక్క అంతరార్థం.

ఈ సూత్రంలోని మొదటి భాగమైన '**తదర్పితాఖిలాచారః సన్**' ద్వారా కామం, క్రోధం, అభిమానం మొదలైనవాటిని భగవంతుని వైపు మళ్ళించాలనే ఉపదేశం, ముందుగా తన సమస్త కర్మాచరణను ఆయనకు అర్పించిన సాధకునికి మాత్రమే వర్తిస్తుందని వివరిస్తున్నారు.

భక్తి అనేది పూజామందిరంలో చేసే ఆరాధనకు మాత్రమే పరిమితం కాదు; సంపూర్ణ జీవితాన్నే భగవదారాధనగా మార్చే మార్గాన్ని భక్తి చూపిస్తుందని ఈ సూత్రం తెలుపుతోంది.

**"కాయేన వాచా మనసేంద్రియైర్వా। బుద్ధ్యాత్మనా వా ప్రకృతే స్వభావాత్।**
**కరోమి యద్యత్ సకలం పరస్మై నారాయణాయేతి సమర్పయామి॥"**

అని చెప్పబడిన సంపూర్ణ సమర్పణ భావాన్ని కలిగి వుండడం; లేక భగవద్గీత వివరించినట్లు

**యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్।**
**యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్॥**

అన్న విధంగా చేసే ప్రతి పని, స్వీకరించే ఆహారం, నిర్వహించే యజ్ఞం, ఇచ్చే దానం, ఆచరించే తపస్సు అన్నింటినీ భగవంతునికి అర్పణగా చేయాలని ఈ సూత్రం యొక్క భావము.

కామాన్ని భగవంతుని వైపు మళ్లించడం సాధ్యమేనా?

సాధారణంగా కామం అనే పదం బాహ్య పరమైన కోరికను సూచిస్తుంది. ఇంద్రియ విషయాలను నిరంతరం ధ్యానించడం వల్ల వాటిపై సంగం ఏర్పడుతుంది; సంగం నుంచి కామం, కామం నుంచి క్రోధం ఉద్భవిస్తాయని భగవద్గీత తెలియజేస్తుంది. మొదట కేవలం చూడడం, వినడం లేదా ఆలోచించడం మాత్రమే అనిపించినది, క్రమంగా ఆసక్తిగా, తరువాత బలమైన కోరికగా, చివరికి బంధనంగా మారవచ్చు. ఆ సంగమునే భగవంతుని వైపు మరల్చినపుడు అదే సత్సంగముగా పరిణమిస్తుంది. లోకవిషయాలను పొందాలనే కోరిక స్థానంలో భగవంతుని స్మరణ, దర్శనం, సేవ, నామసంకీర్తనం పట్ల తీవ్రమైన తపన ఏర్పడాలని ఈ సూత్రం సూచిస్తుంది. ధనం, కీర్తి, అధికారము, ప్రశంస, మొదలైనవి భగవంతునికి దగ్గరవ్వాలనే ఆర్తిగా మారాలి. బాహ్య పరమైన వస్తువులు లభించనప్పుడు కలిగే అసంతృప్తి స్థానంలో, భగవత్స్మరణ లేకుండా గడిచిన కాలం పట్ల ఆవేదన ఏర్పడాలి.

క్రోధాన్ని భగవంతుని వైపు మళ్ళించడం ఎలా?

శ్రీ బాబూజీ మహారాజ్ సాధకుడు క్రోధాన్ని నియంత్రణలో ఉంచుకోవాలి అని సెలవిస్తూ “క్రోధం పై క్రోధం రావాలని” బోధించారు. ఈ సూత్రం కూడా అదే భావనను తెలియచేస్తోంది. సాధారణంగా కోరికకు అడ్డంకి ఏర్పడినప్పుడు, అహంకారం దెబ్బతిన్నప్పుడు, లేదా ఆశించిన ఫలితం రానప్పుడు క్రోధం పుడుతుంది. క్రోధాన్ని భగవంతుని వైపు మళ్ళించడం అంటే భక్తికి అడ్డుగా నిలిచే తన అలసత్వం, నిర్లక్ష్యం, అహంకారం, అసత్యం, ఇంద్రియాసక్తి వంటి వాటి పట్ల కఠినమైన నిరసన కలిగి ఉండడం. ఇతరులపై కోపం చూపడానికి వినియోగించే శక్తిని తన అంతరంగ శుద్ధి కోసం, సాధనలో దృఢత్వం కోసం సాధకుడు ఉపయోగించాలి.

అభిమానాన్ని భగవంతుని వైపు మళ్లించగలమా?

అయితే “**అభిమానదంభాదికం త్యాజ్యం**” అనే ముందు సూత్రంలో అభిమానం విడిచిపెట్టాలని చెప్పబడింది. ప్రస్తుత సూత్రంలో అభిమానం భగవంతునియందే చేయాలని చెప్పడం మొదట విరుద్ధంగా కనిపించవచ్చు. కానీ ఇక్కడ రెండు రకాల అభిమానాల మధ్య వ్యత్యాసాన్ని గుర్తించాలి. తన జ్ఞానం, ధనం, వంశం, స్థానం, భక్తి, సేవ, ఆచారం లేదా ప్రతిభపై గర్వించి ఇతరులను తక్కువగా చూడడం లోకాభిమానం.

తానే స్వతంత్ర కర్తనని, తన గొప్పతనం వల్లనే విజయాలు వచ్చాయని భావించడం అహంకారాభిమానం. ఇటువంటి అభిమానం విడిచిపెట్టవలసినదే.

తనను భగవంతునికి చెందినవాడిగా, ఆయన ఆశ్రితుడిగా, సేవకుడిగా, సఖుడిగా, లేదా ప్రియభక్తుడిగా భావించడం భగవదభిమానం. ఈ భావంలో వ్యక్తిగత గొప్పతనం ఉండదు; భగవంతునితో ఉన్న పవిత్ర సంబంధంపై దృఢమైన విశ్వాసం, మమకారం ఉంటాయి. లోకాభిమానం వ్యక్తిని ఇతరులకంటే ఉన్నతునిగా నిలబెట్టాలని ప్రయత్నిస్తుంది; భగవదభిమానం అతనిని భగవంతుని చరణాల వద్ద వినయంగా నిలబెడుతుంది. భగవదభిమానం శరణాగతిని పెంచుతుంది.

ఈ సూత్రం కామం, క్రోధం, అహంకారం వంటి దోషాలను యథాతథంగా కొనసాగించమని చెప్పడం లేదు. లోకవిషయాలకు సంబంధించిన కామం, ఇతరులకు హాని చేసే క్రోధం, వ్యక్తిగత గొప్పతనాన్ని పెంచే అభిమానం విడిచిపెట్టవలసినవే. వాటిని భగవంతుని స్మరణ, సేవ, సమర్పణ వైపు మళ్ళించడమే నారదుల వారి ఉద్దేశం.

సమస్త ఆచరణను భగవంతునికి అర్పించిన భక్తుడు, తనలోని ప్రతి భావననూ భగవత్ప్రేమకు సాధనంగా పరివర్తన చేసుకోవాలని నారదులు ఈ సూత్రం ద్వారా సూచిస్తున్నారు.

- సశేషం

**ప్రేమాస్పదురాలైన తల్లి చెప్పేదాకా తండ్రి ఎవరో తెలియదు. కంటికి కనిపిస్తూ, పోషిస్తున్నప్పటికీ తల్లి చెప్పిన తరువాతే ఆయన తండ్రి అనే విశ్వాసం అంకురిస్తుంది. అప్పుడే ఆయన పట్ల గౌరవాన్ని, భయ భక్తులను వ్యక్తం చేయడం మొదలవుతుంది. తల్లి చెప్పకపోతే తండ్రి ఎవరో ఎలా తెలుస్తుంది? కంటికి కనిపించే తండ్రి గురించి తల్లి చెబితే గాని యదార్థ జ్ఞానం కలుగదు. అటువంటప్పుడు కనులకు కానరాని లోకజనకుడు, సృష్టికర్త, సర్వవ్యాపియైన ఆ పరమాత్మ గురించి అసలైన జ్ఞానాన్ని మనకు ఎవరు అందిస్తారు? ఇంకెవరు?? చీకటి నుంచి వెలుగు వైపుకు నడిపించే సద్గురువే మనకు భగవత్సంబంధమైన జ్ఞానాన్ని సుబోధకం చేస్తాడు.**

- శ్రీ గురుదేవులు

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**సెప్టెంబర్ 2026**

4 శుక్ర: శ్రీ కృష్ణాష్టమి - కలశస్థాపన, శ్రీ రాధాకృష్ణ సహస్రనామార్చన, భక్త సమారాధన. రాత్రి 7.00 గం. లకు శ్రీ సద్గురు పాదపూజ.

5 శని: శ్రీ కృష్ణాష్టమి, ఉపాధ్యాయ దినోత్సవం - ఉ.11.00 గం.లకు సామూహిక శ్రీ రాధాకృష్ణ సహస్రనామార్చన, భక్త సమారాధన.

6 ఆది: శ్రీ గురుదశమి - ఏకాహం, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

9 బుధ: మాసశివరాత్రి

11 శుక్ర: అమావాస్య

14 సోమ: వినాయకచవితి - ఉ.11.00 గం.లకు శ్రీ సద్గురు పాద పూజ, సామూహిక వినాయకచవితి పూజలు, భక్త సమారాధన.

26 శని: భాద్రపద పూర్ణిమ - ఆశ్రమ ట్రస్ట్ హాస్పిటల్ వార్షికోత్సవం. శ్రీ సద్గురు పాదపూజ

**అక్టోబర్ 2026**

**5 సోమ: శ్రీ గురుదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ**

**8 గురు: మాసశివరాత్రి**

**10 శని: అమావాస్య**

**11 ఆది: శ్రీ దేవీ శరన్నవరాత్రి ప్రారంభం – ఉ. 9.09 గం.లకు అంకురార్పణ**

**17 శని: మూలా నక్షత్రం – సరస్వతీ పూజ**

**18 ఆది: దుర్గాష్టమి – సామూహిక కుంకుమ పూజలు**

**19 సోమ: మహర్నవమి**

**20 మంగళ: విజయదశమి – సామూహిక కుంకుమ పూజలు**

**21 బుధ: ఏకాదశి – ఏకాహం, దీక్షావిరమణ, శ్రీ సద్గురు పాదపూజ**

**26 సోమ: ఆశ్వయుజ పూర్ణిమ – శ్రీ సద్గురు మండల దీక్ష ప్రారంభం. శ్రీ మాతాజీవారి జన్మదిన మహోత్సవం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.**

# మాయా విలాసం

-వేలమూరి రవికుమార్

(గత సంచిక తరువాయి)

1. స్వామీ! కటంజుని వృత్తాంతమంతా మాయయైతే నాకు కలిగిన అనుభవమే అందరు జనులకు ఎలా కలిగింది? 2. నేను బ్రతికి వుండగానే నాకు మరణం ఎలా సంభవించింది? ఆ అనుభవం ఎలా పొందగలిగాను? 3. జరిగిన వృత్తాంతమంతా అసత్యమైతే, మరి అసలు నిజమేమిటి?

శ్రీహరి గాధి ప్రశ్నలకు సంతోషించి, అతనికి జ్ఞానబోధ చేయ సంకల్పించాడు. విచిత్రమేమంటే ఈ ప్రశ్నలు ఒక్క గాధికే కాదు, ఈ కథ చదివిన, విన్నవారి అందరి మనస్సుల్లోనూ ఉద్భవించే ప్రశ్నలే! ఇప్పుడు వీటిపై విచారణ చేద్దాం.

ఒక వ్యక్తి పదిమందితో కలిసి సత్యహరిశ్చంద్ర నాటకం చూస్తున్నాడనుకుందాం. అసత్యము పలకని యెడల రాజ్యము వదిలిపెట్టి వెళ్ళమని విశ్వామిత్రుడు చెప్పినప్పుడు, సత్యవాక్య పరిపాలన కోసం, భార్యా బిడ్డలతో కలిసి రాజ్యాన్ని వదిలి వెడుతున్న దృశ్యం చూసినప్పుడు చూసినవారందరికీ కూడా ఆ విశ్వామిత్రునిపై క్రోధము, ఆవేదన అందరికీ కలిగింది. కాకపోతే కొంతమందికి ఎక్కువ, కొంతమందికి తక్కువగా కలిగింది. విచిత్రమేమిటంటే, ఆ నాటకంలో మునిగిపోయిన అందరూ అవి నిజమైన పాత్రలు అని, అవి తమ జీవితంలో ఒక భాగమని ఆలోచించడం మొదలుపెట్టారు. చివరకు రోహితుడు మరణించాడు. అందరూ ఆ పిల్లవాని కష్టాన్ని, మరియు వాని తల్లి పడుతున్న బాధను చూసి కన్నీటి పర్యంతం అయ్యారు.

నిజానికి అది ఒక నాటకమని, అందులోని వారు కేవలం పాత్రధారులని, కథకుడు, దర్శకుడు కలిసి రూపొందిస్తే అలా నడుస్తున్నాయి అని మరచిపోయి, మనం ఆ పాత్రలు నవ్వితే నవ్వుతాము, అవి ఏడిస్తే మనం ఏడుస్తాం. విచిత్రమేమిటంటే నాటకంలో మొదట్లోగాని, నాటక పర్యంతం కాని ఆ పాత్రలతో మనకు ఎటువంటి సంబంధమూ లేదు. అయితే ఇక్కడ దర్శకుడు సృష్టించిన మాయవల్ల అనేక భావోద్వేగాలకు మనం లోనవుతాం. మానవుని సృష్టికే ఇంత బలముంటే, ఇక ఆ పరమాత్మ మాయా ప్రభావం ఇంకెంత బలంగా వుంటుందో ఆలోచించండి! ఆ పరమాత్మ తలచుకుంటే దర్శకుడు వివిధ పాత్రలను మలచినట్లుగా మన పాత్రలు మలచి అందరికీ ఒకే రకమైన భావన కలుగజేయటం సాధ్యం కాదంటారా? ఇదే విషయాన్ని శ్రీహరి గాధికి తెలియజేశాడు. 'నా మాయ వల్ల ఇదంతా నీవు నీకు జరిగినట్లుగా, నీ మీద ఆపాదించుకుంటున్నావు. అంతేకానీ, నీకు ఆ కటంజుడికి ఏ మాత్రము సంబంధంలేదు. నీవు గాధిగానే వున్నావు. కటంజుని అనుభవాలను నా మాయా ప్రభావం చేత నీకు ఆపాదించుకుని కలత చెందుతున్నావు. కనుక ఇది నా మాయ అని గ్రహించి, సత్య విచారణవైపు అడుగు వెయ్యి' అని మొదటి ప్రశ్నకు సమాధానం ఇచ్చాడు శ్రీహరి.

ఇక రెండవ ప్రశ్న – నేను బ్రతికి వుండగానే నాకు మరణానుభవం ఎలా కలిగింది? – దీనిని విచారణ చేద్దాం. మనం ఒక ప్రమాదానికి గురి అయ్యాం అనుకుందాం. మన కాలో చెయ్యో విరిగింది. డాక్టర్ వచ్చి ఆపరేషన్ చేయాలన్నారు. మనకు సంపూర్ణ స్పృహ వుంటే ఆ నొప్పి భరించలేమని మత్తు మందు ఇచ్చి కాలు కోసి, విరిగిన ఎముకను సరిచేసి, దానిపై ఒక ప్లేటు వేసి స్క్రూ బిగించి, మరతో కోసిన చర్మాన్ని దగ్గరకు చేర్చి, కుట్లు వేశాడు డాక్టర్. కాలు వరకు మాత్రమే మత్తు ఇవ్వడం వలన, పైన వున్న శరీరం అంతా జరుగుతున్న విషయం గ్రహించింది. కానీ ఎటువంటినొప్పికి, బాధకు గురికాలేదు. అంటే, మత్తు మందు అనే మాయ మనలను ఏమీ తెలియని స్థితిలో జరుగుతున్నంత సేపూ వుంచి ఆపరేషన్ జరిగేటట్లు చేసింది. ఆ మాయయే లేకపోతే మనం ఆ బాధను తట్టుకోలేము. కనుక ఆపరేషన్ జరుగున్నంత సేపూ (గాధిని కలలో వుంచటం) మనకు ఏమీ తెలియని స్థితిలో వుంచడానికి డాక్టర్ మత్తు మందు అనే మాయ మన మీద ప్రయోగించాడు. కొంతమంది వ్యక్తులు కోమాలో వుంటారు. వారికి అవయవాలు  ఏవీ పనిచేయవు. కానీ మరణించేటంత వరకూ ఆ జీవుడు బాధపడుతూనే వుంటాడు. ఒకొక్కసారి దీనికి గుర్తుగా కోమాలో వున్న వ్యక్తులు కన్నీరు కార్చడం డాక్టర్లు గమనించిన విషయాలు మన వార్తాపత్రికలలో ప్రకటించడం కూడా జరిగింది.

ఇంకొక విచారణ. మనం నిద్రపోతున్నాం. కలలో ఒక పెద్ద ప్రమాదానికి గురయ్యాము. అందులో మనం విపరీతమైన వేదన అనుభవించి మరణించాము. వెంటనే మెలకువ వచ్చి చూసుకుంటే ప్రక్కమీదే పడుకుని వున్నాము. అవయవాలను తాకి, కదిలిపించుకుంటున్నాము అన్నీ బాగానే వున్నాయి. మరి అన్నీ బాగానే వుంటే మరణాన్ని పొందినదెవరు? ఆ అనుభవం ఎలా కలిగింది? అంటే మన మనస్సు ఒక భ్రాంతిని కలగా రూపొందించి మన చిత్తం మీద ఆ భ్రాంతిని ఒక సినిమా రీల్ లాగా కదిలిస్తే, మనం అది సత్యమనుకొని విపరీతమైన బాధకు గురి అయ్యాము. ఏడ్చాము, అరిచాము, చివరకు మరణించాము. మెలకువ రాగానే ఇదంతా ఒక కలరా అని సంతోషపడ్డాము. రెండూ ఆ పరమేశ్వరుడు ఆడించే నాటకములోని భాగములే కాని, మన ప్రమేయమేమీ లేదు. అసలు మాయ తొలగితే, మనము నిత్యము, సత్యము అయిన ఆత్మవస్తువును తెలుసుకోగలిగితే, ఈ సంసార చక్రం నుండి బయటపడవచ్చు. అందుకే శ్రీగురుదేవులు లక్ష్యార్థసాధన, విచారణ, గురుబోధను ఎవరైతే నిత్యమూ పాటిస్తారో వారు జననమరణాలను దాటి, మోక్షమార్గమును పొందగలరని పలుమార్లు తమ బోధలో వివరించారు. కనుక శ్రీహరి గాధికి ఇలా చెప్పాడు 'గాధి మునీ! నీకు నా మాయా ప్రభావం వలన మరణానుభవం కలిగిందే కాని, నీవు నిజంగా మరణించలేదు' అని.

- సశేషం

# భువిలో వెలసిన దివ్య కల్పతరువు

సేకరణ - కీ.శే. ఎమ్. జానకిరామ శాస్త్రి

భగవాన్ శ్రీరామకృష్ణులు అవతార పరిసమాప్తి ఘట్టాన్ని గడిపిన "కాశీపూర్ ఉద్యానగృహం" అటు రామకృష్ణ సంఘ చరిత్రలో, ఇటు ప్రతి భక్తుడి జీవితంలోనూ అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్న దివ్యక్షేత్రం. గురుదేవులకు 1885 సంవత్సరం గొంతులో వ్రణం రావడంతో ప్రశాంత వాతావరణం కోసం మొదట శ్యాంపుకూర్‌కు తర్వాత కాశీపూర్‌కు తీసుకెళ్ళారు. ఈ కాశీపూర్ ఉద్యానవనం కలకత్తా నగరానికి 3 మైళ్ళ దూరంలో ఉంది. ఈ ఉద్యానగృహాన్ని నెలకు ఎనభై రూపాయల అద్దెకు తీసుకున్నారు. సురేంద్రనాథ్ అనే గృహస్థ శిష్యుడు ఆ పైకం చెల్లించేవాడు. నాలుగున్నర ఎకరాల విస్తీర్ణంలో చక్కటి ప్రకృతి రమణీయతతో కాలుష్యరహిత వాతావరణంలో ఉంది ఈ ఉద్యానగృహం.

గురుదేవుల యువ సన్యాసశిష్యులు ఎక్కడా లోటుపాటు రాకుండా, అసౌకర్యాలు లేకుండా, గురుదేవులను ఎంతో భక్తిశ్రద్ధలతో, అపురూప ఆదరాభిమానాలతో, సేవించుకునేవారు. యువ సన్యాస శిష్యులందరూ ఎంతో ప్రగాఢ మాధుర్యభరిత మైత్రీ బంధంతో ఉండేవారు. రామకృష్ణులవారి ఉన్నతమైన బోధనలు నరేంద్రాది శిష్యులను కాశీపూర్‌కు, గురుదేవుల పాదపద్మాలకు అలా కట్టిపడేశాయి. గురుదేవులు వీరందరిలో భక్తి జ్ఞాన సర్వసంగపరిత్యాగ జ్వాలలను మరింత ఉద్దీపింపజేసినది ఈ కాశీపూర్‌లోనే. భవిష్యత్ రామకృష్ణ సన్యాస సంఘం బీజప్రాయంగా రూపుదిద్దుకున్నది ఈ కాశీపూర్‌లోనే! ఈ అంతరంగిక శిష్యులందరూ శారదాదేవితో కలసిమెలసి ఉండేటట్లు చూసేవారు గురుదేవులు. ఈ తల్లిని సైతం తమ నిష్క్రమణ తర్వాత చేయవలసిన అవతార పరిపూర్ణ ప్రయోజన సిద్ధికి సమాయత్తపరచినది ఈ కాశీపూర్‌లోనే!

నరేంద్రుడు కుటుంబ పరస్థితులను మెరుగుపరచడంకోసం న్యాయవాద విద్యను అభ్యసిస్తున్న రోజులవి. కాని వాటన్నిటినీ వదలిపెట్టి గురదేవుల పాదాలమీద వాలిపోయిందీ కాశీపూర్‌లోనే. శిష్యబృందానికి నాయకుడిగా తీర్చిదిద్దబడిందీ ఇక్కడే. కేవలం నరేంద్రుడికి మాత్రమే గది తలుపులు మూసివేసి బోధించిన సందర్భాలెన్నో! ఆ సనాతన దివ్య నర నారాయణ మూర్తులకు వేలవేల ప్రణామాలు. అంతేకాదు, లోకహితం కోసం గురుదేవులు తమలో అభివ్యక్తమవుతున్న దివ్యశక్తినంతటినీ నరేంద్రుడిలో ఆవహింపజేసింది ఈ కాశీపూర్‌లోనే! 1886 జనవరి 1వ తేదీన గురుదేవులకు కొద్దిగా స్వస్థత చేకూరడంతో మధ్యాహ్నం మూడు గంటలకు మేడ మీద నుండి క్రిందకి దిగివచ్చారు. ముప్పైమందికి పైగా భక్తులు ఇంట్లోనూ, చెట్లక్రింద సమావేశమై ఉన్నారు. గిరీశ్, రామ్ మొదలైన వారంతా గురుదేవులను చూడగానే ఆనంద పారవశ్యంతో వారిని సమీపించారు. వారి పాదాలవద్ద మోకరిల్లి ఎనలేని భక్తిప్రపత్తులు ప్రకటించారు. "మీ అందరిలో ఆధ్యాత్మిక జాగృతి కలుగుగాక!" అని ప్రసన్న వదనంతో గురుదేవులు ఆశీర్వదించారు.

పరమాద్భుత దేవతామూర్తి దివ్యలోకాల నుండి దిగివచ్చి అలౌకిక మాతృ వాత్సల్యంతో తమ సమక్షంలోఉన్నట్లు వారి ఉనికి, మాటలు, దృక్కుల ద్వారా అనుభూతం

చేసుకున్నారు. గురుదేవులలోని కృపాశక్తి, ప్రేమశక్తి, ఉద్ధారకశక్తి, అనుగ్రహశక్తి, అనంత దివ్యానంద సాగరంలోని అలలవలె అందరినీ ముంచెత్తివేసింది. ఆ ప్రభావంతో రాంలాల్ ఛటోపాధ్యాయకు ఎంత ప్రయత్నించినా అసంపూర్ణంగా లభించే ఇష్టదేవతా దర్శనం ఆ సమయంలో సంపూర్ణంగా లభించింది. వైకుంఠనాథ్‌కు సమస్త ప్రకృతిలో అణువణువునా గురుదేవుల దేదీప్యమానమూర్తి దర్శనం జరగడంతో సంభ్రమ విభ్రాంతులకు గురయ్యాడు. విశ్వరూప సందర్శనయోగ ప్రభావతీక్షణతను తట్టుకోలేని అర్జునుడి పరిస్థితి లాగా అయ్యింది అతని పరిస్థితి. క్రితం రోజు రాత్రంతా చేసిన కఠోర సాధనవలన కొందరు నిద్రపోతున్నారు నరేంద్రుడితో సహా, మరికొందరు గురుదేవులు తిరిగివచ్చే లోపల వారి గదిని శుభ్రం చేయడంలో నిమగ్నమయ్యారు. ఈ సంఘటనలో గురుదేవులు ప్రకటించిన అనంత కృపాశక్తి, ఉన్నతోన్నత ఆధ్యాత్మిక చైతన్య భూమికలు ఈ మహనీయ శిష్యులందరూ ఇదివరకే స్వంతం చేసుకున్నవారే కదా!

ఈ జనవరి 1వ తేదీ నాటి దైవీయమైన, చరిత్రాత్మికమైన, దివ్య సంఘటనను స్మరించుకుంటూ రామకృష్ణ సంఘ సంప్రదాయంలో ఈ రోజును "కల్పతరు దినోత్సవం"గా గొప్ప వేడుకగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. కానీ లోతుగా ఆలోచిస్తే గురుదేవులలో ఆ దివ్యశక్తి అభివ్యక్తీకరణ ఎన్నో సంవత్సరాల క్రితం నుంచే జరుగుతున్నది. 1875వ సంవత్సరం కేశవచంద్రసేన్ వీరి దివ్యత్వాన్ని, మహత్త్వాన్ని ప్రచారం చేయడం ద్వారా తమ దగ్గరకి వచ్చిన ఎందరో భక్తులలో ఆధ్యాత్మిక జాగృతిని, భగవత్పారవశ్య భావనను కలుగజేశారు. వైష్ణవచరణ్, గౌరీపండితుడు, శశిధర్ చూడామణిలాంటి ఉద్దండ పండితులకు, భైరవీ బ్రాహ్మణిలాంటి మహాతాంత్రిక సాధకులకు, తోతాపురిలాంటి మహా బ్రహ్మజ్ఞానులకు సైతం వారివారి సాధనలలోని లోటుపాట్లను సరిదిద్ది పరిపూర్ణ సిద్ధిని పొందేటట్లు చేసిన జగద్గురువులు గురుదేవులు. తమ ఉనికి, స్పర్శ, సరళమైన బోధనలు, పాటల ద్వారా, బీజాక్షరాలను వ్రాయడం ద్వారా ఎంతెంతటి ఆధ్యాత్మిక శక్తిని పంచారో కదా! అందుకనే వివేకానందులు, "ఈశ్వర జగదీశ్వర యోగసహాయ్" అని కీర్తించారు.

శివకేశవ సమన్వయ స్వరూపంగా విశుద్ధగర్భ సంస్కారంతో జన్మించిన గురుదేవులు స్వతస్సిద్ధంగానే జన్మతోనే దివ్యకల్పతరుతత్త్వంలో అవతరించారు. 1.మందారం, 2.పారిజాతం, 3.సంతానం, 4.హరిచందనం, 5.కల్పవృక్షం – ఈ అయిదూ దేవలోకంలోని దివ్యకల్పతరువులు. అడిగినవారికి ఏదైనా ప్రసాదించగలిగే గొప్పశక్తివంతమైన మహత్త్వం గలవి. అయితే మన శ్రీరామకృష్ణ కల్పతరువు ఏది కోరుకోవాలో కూడా తెలియని అయోమయ, అజ్ఞాన, ప్రాపంచిక జీవుడికి ఉన్నత గతులకు హేతువైన దివ్యభక్తి జ్ఞానాలను ప్రసాదిస్తూ తద్వారా అంతరంగ స్వచ్ఛతను, భగవదనుభూతిని, ఆత్మజ్ఞానాన్ని కలుగజేస్తారు. స్వర్గలోకంలోని అయిదు కల్పతరువుల దివ్యత్వాన్ని మించి ప్రకాశిస్తున్నది. ఆ భవ్యమైన కల్ప తరువు. అఖండ సచ్చిదానందమైన ఆ కల్పతరు తత్త్వానికి మంగళం! శతసహస్ర వందనములు.

(గత సంచిక తరువాయి) **నిరీక్షణ** తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్

తెలుగు అనువాదం - శశికళా దివాకర్

ఇలా రావణునికి బదులిచ్చిన కుంభకర్ణుడు వెనువెంటనే యుద్ధభూమికి వెళ్ళాడు. చిన్న అన్నను గాంచిన విభీషణుడు, ఆతని వద్దకు వచ్చి, "సహోదరా! నీవు ధర్మమును తెలియనివాడవు కాదు. మన అన్నగారు సీతను అపహరించి పాపం చేసారన్నదే నీమాట కూడా! కావున ఆ పాపమునకు నీవు సహకరించవచ్చునా!? నీవు కూడ నావలే ధర్మమువైపు మ్రొగ్గియుండవలయునన్నదే నా కోరిక. దీని వలన నీవు నాశనముగాకుండ ఉండగలవు." అని కోరాడు విభీషణుడు.

కుంభకర్ణుడు, విభీషణుడితో తాను అన్న రావణుడ్ని అనాధను జేయ ఇష్టపడలేదని దృఢంగా చెప్పాడు. అదే సమయమున ధర్మం ముందు పాపకర్మ అపజయము పొందునని కూడ చెప్పిన సద్గుణుడైన కుంభకర్ణునికి అనేకమార్లు వందన మొసగి రాముని వద్దకు వెళ్ళిపోయాడు విభీషణుడు.

ఆ తరువాత జరిగిన భీకర పోరాటమందు, ఆతడు రాముడి సైన్యమునకు గొప్ప నష్టం కలిగించిననూ, అంత్యమున రాముడు, తన బాణ ప్రయోగముచే కుంభకర్ణుడ్ని నేలకొరిగించాడు.

ఈ మధ్యలో రావణుడు ఒక నీచమైన తంత్రమునకు పాల్పడ్డాడు. తన మాయాజాలముచే ఒక అసురుడ్ని జనకుని పోలినట్లు గావించి సీతముంగిట నిలిపాడు. ఆ మాయా జనకుడు సీతవద్ద, "నేను, మన మిథిలా కులము బ్రతికి ఉండాలంటే నీవు రాముని మరచిపోయి, లంకానగరాధిపతికి వశముగావలయును. లేని పక్షంలో అయోధ్యలో ఉన్న భరతుడు మున్నగు వారికి ఆపద ఏర్పడును" అని మొసలి కన్నీరు కార్చాడు.

తన తండ్రి జనకుడు ఇటువంటి అధర్మముతో కూడిన పదములను పలుకడను విషయమును బాగుగా తెలిసినదగుటచే, సీత ఆ మాయా జనకుడిని పలుమార్లు దూషించింది. ఆ సమయమున కుంభకర్ణుడు యుద్ధమున మరణించాడన్న వార్త వినిన రావణుడు అచ్చోటనుండి వెళ్ళిపోయిన మరుక్షణమే ఆ మాయా జనకుడు తన రాక్షస రూపమును పొందాడు. సీత గాఢంగా ఊపిరి విడిచి, అసురుల ఇట్టి నీచమైన చేష్టలను తలచి బాధపడింది.

ప్రియ సహోదరుడు కుంభకర్ణుడి మరణవార్త రావణుని బాగుగా కృంగదీసింది. ఆ తరువాత అనేకమంది అసురులను యుద్ధమునకు పంపగ, వారందరూ వీరస్వర్గమును పొందక తప్పలేదు. "ఎవరీ రామ లక్ష్మణులు? ఎక్కడనుండి

ఇంతటి బల, పరాక్రమములు పొందారు?' అని ఆలోచిస్తూ తన తనయుడైన ఇంద్రజిత్తును పిలిపించాడు. "కుమారా! ఇప్పుడు నీవు మాత్రమే నా గౌరవమును కాపాడవలయును" అన్న తండ్రితో ఇంద్రజిత్తు, "నేను ఒక్కడిని ఉన్నంత వరకు మీరు దేనికీ భయపడనవసరంలేదు. నిరాశ పడకుండా వేచి చూడండి. విజయముతో నేను తిరిగి వస్తాను" అన్నాడు.

యుద్ధప్రావీణ్యముతో బాటుగ మాయాజాల విద్యయందునూ నిష్ణాతుడైన ఇంద్రజిత్తు తాను ఉన్నట్లు తెలియకుండా నాగపాశముతో రామ, లక్ష్మణులను కట్టివేసి, "ఇకపై వీరు బ్రతకలేరు" అనుకుని గర్వముగ తన తండ్రికి ఆ విషయమును తెలియజేసాడు. సుగ్రీవ, జాంబవంత, విభీషణులకు ఏమి చేయాలో పాలుపోక కూర్చుండిపోయారు. అప్పుడు హనుమంతుడు, గరుత్మంతుని ప్రార్థించగ, నాగములకు ఆగర్భశత్రువైన ఆ పక్షిరాజు అచ్చటకు వచ్చిన వెంటనే ఆ అంబులలో చిక్కుకున్న నాగములన్నియూ తప్పించుకుని పారిపోగ, రామ లక్ష్మణులు మూర్ఛనుండి బయటపడ్డారు.

ఆ తరువాత, ఇంద్రజిత్తు సీతనుబోలిన బింబమును ఏర్పరచి, వానరుల ముంగిట ఆ బింబముయొక్క తలను నరకివేసి ఆమె మరణించినట్లుగ వారికి ఒక భ్రమను కల్పించాడు. అది చూచి మిక్కిలి వ్యధకు గురైన వానరులు రామునివద్దకు వెడలి ఈ సమాచారమును చేరవేసారు. ఆ వార్తను వినిన రామలక్ష్మణులిరువురూ ఆశ్చర్యచకితులయ్యారు. చెంతనేయున్న విభీషణుడు రామునితో, "తండ్రీ! కలత చెందవలదు. రావణుడు ఏ దినమైననూ సీతను సంహరించ అంగీకరించడు. ఇదంతయూ ఇంద్రజిత్తు చేసిన మాయాజాలం" అన్నాడు.

తేలికపడిన మనసుతో రామలక్ష్మణులు మరల ఇంద్రజిత్తుతో తమ పోరాటం కొనసాగించారు. ఆతడు కడు ఉగ్రముగ పోరాడి, బ్రహ్మాస్త్రముచే లక్ష్మణుని క్రిందపడవేసాడు. తమ్ముని స్థితినిజూచిన రాముని బాధ పొంగి కట్టలు తెంచిన సముద్రమైంది. రాముడి మనోవ్యాకులతను గుర్తించిన విభీషణుడు, తన అంతరంగ వైద్యుడ్ని పిలిపించి, మూర్ఛబోయిన లక్ష్మణుడికి చికిత్స చేయమని కోరాడు. "రేపు సూర్యోదయం లోపు హిమాలయమందుండు సంజీవిని మూలికలను తీసుకొని వచ్చినట్లైతేనే లక్ష్మణుడ్ని బ్రతికించగలము" అని బదులిచ్చాడు ఆ వైద్యుడు. ఇదంతా వినిన హనుమంతుడు తృటిలో హిమాలయముండు వైపుకు వెడలి, సంజీవిని పర్వతమును చేతితో పట్టుకొని, తిరిగివచ్చాడు. తమ్ముడి మైకం వీడిపోయింది.

- సశేషం

(గత సంచిక తరువాయి) **శ్రీ గురుగీతా** -కీ.శే డా॥వి.వి. ప్రసాదరావు

## అథ ప్రథమోధ్యాయః

**ఆసనం శయనం వస్త్రం వాహనం, భూషణాదికం**

**సాధకేన ప్రదాతవ్యం గురు సంతోష కారణం 50**

**<u>పదవిభాగము</u>** :- ఆసనం-శయనం-వస్త్రం-వాహనం-భూషణాదికం-సాధకం- ప్రదాతవ్యం-గురు సంతోష కారణం.

**<u>టీక</u>** :- ఆసనం = కూర్చుండుటకు ఆసనము; శయనం = పరుండుటకు శయ్య; వస్త్రం = ధరించుటకు వస్త్రము; వాహనం = వాహనము; భూషణాదికం = ధరించుటకు ఆభరణములు మొదలగునవి; గురుసంతోషకారణం = గురువు సంతోషించుటకుగాను, సాధకేన = సాధకుడైన శిష్యునిచే; ప్రదాతవ్యం = సమర్పింపదగినవి.

**<u>వ్యాఖ్య</u>** :- "ఆసనము, శయ్య, వస్త్రము, వాహనము, భూషణాదులు గురువు సంతోషించుటకుగాను, సాధకుడైన శిష్యునిచే సమర్పింపదగినవి" అని గురు సేవ ఏ విధముగా చేయవచ్చునో తెలియజేస్తున్నాడు పరమేశ్వరుడు. ప్రేమ, వినయము, ఉపాసన మొదలైన పదములన్నియు ఊహ చేత తెలుసుకొనదగినవే. ఒకడు తన కుమారుని, లేక భార్యను ప్రేమించుచున్నాడని ఎట్లు తెలియును? వాడు చేయు పనులను బట్టి తెలియును. పిల్లవానికి తినుబండారములో, ఆట వస్తువులో, కొత్త దుస్తులో యిచ్చి తన ప్రేమను వ్యక్తీకరించును, భార్య యైనచో నగలో, చీరలో యిచ్చి యామెను సంతోషింపజేయును. ఇవి వారు అడిగినందువలన యిచ్చుట కాదు, తన ప్రేమాభివ్యక్తికిచ్చుట.

కాని గురు దేవుడు పుత్రుని వలె, భార్యవలె లౌకిక వస్తు జాలమును కోరి అవి పొందినచో సంతసించు స్వభావము కలవాడు కాడు. ఆయన దృష్టిలో యివి లేనివే కాని శిష్యుని దృష్టిలో యివి యున్నవి. కనుక వీనినాతడు సమర్పించవచ్చును. గురుదేవుడు సంతోషించును కూడ, ఎందువలన? "నా శిష్యునకీ లౌకిక విషయములను త్యజించవలెనను త్యాగ బుద్ధి కలిగినది గదా"

యను భావము వలనను, తనయందు వ్యక్తీకరింపబడు ప్రేమను గ్రహించియు గురుదేవునకు ఆనందము కలుగును.

**కర్మణా మనసా వాచా సర్వదా ఽ_రాధయేద్గురుమ్**
**దీర్ఘదండం నమ స్కృత్య నిర్లజ్జో గురు సన్నిధౌ. 51**

**<u>పదవిభాగము</u>** :-

కర్మణా–మనసా–వాచా–సర్వదా–ఆరాధయేత్ గురుమ్– దీర్ఘ దండం –నమస్కృత్య–నిర్లజ్జో– గురు సన్నిధౌ

**<u>టీక</u>** :- కర్మణా=కర్మచేతను (అనగా కాయముచేత); మనసా=మనస్సు చేత; వాచా=వాక్కుచేత; గురుమ్=శ్రీ గురుదేవుని; సర్వదా=ఎల్లపుడు; ఆరాధయేత్=ఆరాధించవలెను; దీర్ఘదండం నమస్కృత్య= సాష్టాంగ దండ ప్రణామముచేసి; గురుసన్నిధౌ=గురుసాన్నిధ్యమునందు; నిర్లజ్జః= అభిమానమును విడచియుండవలెను.

**<u>వ్యాఖ్య</u>** :- "మనో వాక్కాయ కర్మలతో శ్రీ గురుదేవుని సర్వకాలమును ఆరాధించుచు, వారి సన్నిధిలో సాష్టాంగ సమస్కారమొనర్చి, దేహాభిమానము విడిచి వర్తింపవలె" నని పరమశివుడు గురు భక్తుని యిక్కడ ఆదేశిస్తున్నాడు. ఇంతకు ముందు చెప్పినట్లు శ్రీ గురుదేవుని తను మన ధనములతో నిష్కల్మష భక్తితో సేవించవలెను, ఇతరులను సేవించుటలో అడ్డు వచ్చునది దేహాభిమానము. తన పాండిత్యము, అభిజాత్యము, ధన ధాన్యాది సంపదలు "నేనింత వాడనుగదా" యని దేహాభిమానుమును గల్గించి పెద్దల ముందు తలవంచనీయదు. అందునను పాశ్చాత్య, ముసల్మాను పరిపాలనలలో అలవాటైన ఒంటిచేతి సలాముల వలన సాష్టాంగ దండప్రణామము చాలా అరుదై, అట్లు నమస్కరించుట తమ హెూదాకు తగదని భావించుట ఎక్కువైనది. అట్టి వ్యర్ధమైన దేహాభిమానమును త్యజించినగాని గురువును సేవించుటకర్హత కలుగదు. అందుచేత దేహాభిమానమును వదిలివేసిన గాని శిష్యునకు గురుసేవ కధికారము సిద్ధించదని యిచ్చట తెలియజేయబడినది, ఇది ప్రధానముగా కాయముతో జేయుసేవ.

- సశేషం

(గత సంచిక తరువాయి) # గురుకృప కీ.శే.- వై. లక్ష్మీనరసమ్మ

సరిగ్గా ఆరు నెలల తరువాత నరసమ్మగారి మనువడికి కలలో ఆవిడ మండపేటలో వాళ్ళ ఇంటి ముందుకు వచ్చి కనిపించి "నా టైం అయిపోయింది, నేను వెళ్ళిపోతున్నా" అంటుంటే కాలభైరవుడు శునకంతో, భూత గణాలతో దక్షిణాభిముఖంగా ప్రత్యక్షమై నరసమ్మగారిని భుజం పట్టుకొని తనలో ఐక్యం చేసుకున్నట్టు కనిపించింది. జీవితంలో ఎన్ని ఎత్తు-పల్లాలు వచ్చినా మనస్సు మాత్రం అచంచల విశ్వాసంతో ఎల్లప్పుడూ దయానిధియైన శ్రీబాబు యందే నిలిపి వారి నామ స్మరణే అనుక్షణం, అంత్యకాలం వరకు చేసుకున్న నరసమ్మగారు ధన్యజీవి.

ఒకసారి శ్రీబాబు సుబ్రహ్మణ్యం బాబుకి స్వప్నంలో దర్శనం ఇచ్చి అతను శ్రీబాబు పాదాలకి నమస్కరిస్తుంటే శ్రీబాబు అతన్ని చూసి నవ్వుతూ తమ దివ్య హస్తములతో ఆప్యాయంగా చుబుకాన్ని పట్టుకుని "ఎంత కాలానికి కలుసుకున్నామురా మనం!" అని ఆడిగి ఆశీర్వదించినట్లు కల వచ్చింది.

శ్రీబాబు కాళీకి 1988 సం. గురుపూజ సమయంలో ఇచ్చిన మాట నిజం చేస్తూ ఈనాడు శ్రీబాబే శ్రీఅమ్మ (శ్రీమాతాజీ) రూపంలో కాళీ కుటుంబానికి ఆశ్రమంలో స్థిర నివాస భాగ్యం కల్పించారు. ఋష్యశృంగ ఆశ్రమంలో గృహప్రవేశం అయిన తరువాత కాళీ కొడుకు బాబుకి, శ్రీబాబు పసుపు వస్త్రాలతో స్వప్నంలో దర్శనం ఇచ్చి తన భుజంపై చెయ్యివేసి ఆశ్రమంలో తమ ఇంటికి తీసుకువెళ్ళినట్టు, అదే భవంతి టెర్రస్ పైకి ఎక్కి కాళీవనాశ్రమాన్ని అంతా కలయచూసిన శ్రీబాబు చిరునవ్వుతో, "ఊ! బాగుంది" అని అన్నట్టు కల వచ్చింది.

2019 సం.లో ఒకసారి జె.కె.బాబు, సుబ్రహ్మణ్యం బాబు కలిసి తిరుపతి వెళ్ళినట్టు, అక్కడ శ్రీవేంకటేశ్వరుని దర్శించుకుంటున్న సమయంలో స్వామివారు వీరిద్దరి ముందు ప్రత్యక్షమై కుశల ప్రశ్నలు అడిగి వృత్తి గురించి చెబుతుంటే "తప్పకుండా అవుతుంది" అని ఆశీర్వదించినట్లు స్వప్నంలో సుబ్రహ్మణ్యంబాబుకి కనిపించింది. సరిగ్గా అలాగే వీరిద్దరూ అహోబలరాజుగారింటి ముందు నిలుచుంటే శ్రీఅమ్మ వారి గృహంలో నుంచి బయటకి వస్తూ వీళ్ళని చూసి కుశల ప్రశ్నలు అడిగి, ఇద్దరి వృత్తి గురించి మాట్లాడి దీవించి పంపారు.

గురువుదేవుని ప్రేమ, కారుణ్యం అనంతం గురుభగవానుని యందు మనకి కావలసినది భక్తి, విశ్వాసం. "మీ మనస్సు రెండు నిముషాలు మీరు నమ్మిన ఆ భగవానుని (గురుదేవుని) మీద నిలిస్తే చాలు, అన్నీ ఆ పరంధాముడే చూసుకుంటాడు"

అని మన పూజ్య గురుదేవులు శ్రీ బాబుజీ మహారాజ్ ఎన్నో సార్లు తమ భోదామృతంలో చెప్పారు. దానికి నిదర్శనంగా కాళీ కొడుకు బాబు విషయంలో ఒక సంఘటన జరిగింది.

రాష్ట్రంలోని కోర్టులలో పెండింగు కేసులు పెరిగిపోతున్నాయి అని 2014 సంవత్సరం ముందు ఫైలైన కేసులను త్వరగా పరిష్కరించబడాలి అని హైకోర్టు ఒక సర్క్యులర్ తీసుకువచ్చింది. దీని వల్ల న్యాయవాదుల మీద కూడా ఒత్తిడి రావడం మొదలయింది, బాబు ప్రతినెల పెదకాకానిలో ఉన్న దేవాదాయ ధర్మాదాయ కోర్టుకి కేసుల నిమిత్తం వచ్చేవాడు. డిసెంబర్ 17వ తేది 2019లో వచ్చినప్పుడు ఆ కోర్టు జడ్జి బాబుతో, "మీ కేసులు కూడా చాలా కాలం నుంచి పెండింగులో ఉన్నాయి కాబట్టి వాటిలో నేను జడ్జిమెంట్ చెప్పేస్తా" అంటే దానికి బాబు "ఇంకా ఆర్గుమెంట్స్ (వాదనలు) అవ్వలేదు, జడ్జిమెంట్ చెబితే క్లయింట్లు నష్టపోతారు" అంటూ వాయిదా తీసుకుని ఇదే విషయం తన సీనియరుతో చెపితే "నేను వస్తాను ఈపట్టు కోర్టుకి" అని బాబుతో చెప్పారు. కానీ అదే నెల 31వ తేది వాయిదాకు తన సీనియరు ఆరోగ్యరీత్యా "నేను రాలేకపోతున్నాను" అని మళ్ళీ బాబునే పంపారు. కానీ జడ్జికి ఎంత చెప్పినా ఆయన ఇదేమీ పట్టించుకోకుండా వచ్చే నెల 7న నేను జడ్జిమెంట్ చెప్పేస్తా అంటూ వాయిదా వేసేశారు. 2020 సం. జనవరి 6వ తేది ఎప్పటిలాగే ఆశ్రమానికి వచ్చాడు బాబు. కానీ రేపు ఎలా గడుస్తుందో, తన సీనియరుకి ఏం సమాధానం చెప్పాలో తెలియక రాత్రి అంతా "ఓం బాబు" అనుకుంటూ శ్రీబాబు నామస్మరణ చేసుకుంటూ వుండిపోయాడు. ఉదయం కోర్టుకు వెళ్లిన తరువాత కూడా శ్రీబాబు నామస్మరణే చేసుకుంటూ ఉండగా జడ్జి వచ్చి బాబుని పిలిచి నవ్వుతూ, "నేను నీ కేసులలో జడ్జిమెంట్ ఇవ్వడంలేదు, ఈ పీఠం ఆశాశ్వతమైనది, దీని మీద నాకు ఎటువంటి ఆపేక్ష లేదు, నేను వెళ్లిపోతున్నాను" అని అన్నారు. తాను నమ్ముకున్న దేవుడు శ్రీబాబే తనను ఈ ఆపద నుండి గట్టెక్కించారు అని ఆనంద బాష్పాలతో మనసులోనే శ్రీబాబుకి నమస్కరించుకున్నాడు.

- సశేషం

**చిత్తచలతి సంసారో, నిశ్చలే మోక్ష ఉచ్యతే! మనశ్చాంచల్యమే సమస్త సంసార బంధాలకు మూలము. నిర్మలమైన మనస్సును పరమాత్మ యందే స్థిరపరచుకోవడం అత్యంతావశ్యకము. మనస్సు నిలకడగా వున్నప్పుడే మోక్షాన్ని సాధించుకోవడం సాధ్యమవుతుంది.**

- శ్రీ కాళీబాబు

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## గుంటూరు భక్తులతో శ్రీబాబు

(గత సంచిక తరువాయి)

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

వండుగ ఒకరోజే అయినా, శ్రీ బాబు ముందుగానే పాండుగారింటికి రావటం, తరువాత కూడా కొన్ని రోజులు ఉండటం జరిగేది. అందువలన శ్రీ బాబు దర్శనం కోసం వచ్చే భక్తుల సంఖ్య పెరిగిపోతూ ఉండేది. అందులో కొందరు శ్రీ బాబు ఉన్నన్ని రోజులు ఉండేవారు. మధ్య మధ్యలో శ్రీ బాబు ఏదైనా చిన్న చిన్న పనుల మీద గ్రామాంతరం వెళ్ళినా కొందరు వారు తిరిగి వచ్చే వరకు వేచి ఉండేవారు. కొందరు శ్రీ బాబు ఏదైనా దీక్ష చెబితే, ఆ మండలం రోజులు అక్కడే ఉండి దీక్ష చేసేవారు. యిలా అనేక కారణాల చేత వచ్చి వారింట్లో ఉండే జనం ప్రతీ రోజు వందల సంఖ్యలలోనే ఉండేవారు. అతిధులను దైవ సమానంగా ఆదరించే ఆ కుటుంబ సభ్యుల ఉత్తమ సంస్కారమునకు ముగ్ధులైన శ్రీ బాబు వారికి నిరంతర అతిథి సేవా భాగ్యమును పుష్కళంగా ప్రసాదించారు.



పాపాయమ్మగారు, కాంతమ్మగారు అలా వచ్చి ఉన్న భక్తులందరికి, ప్రతీ రోజు ఉభయ సంధ్యలలోను అల్పాహార పానీయములు ; మధ్యాహ్నం షడ్రసోపేతమైన భోజనము; ఇవన్నీ క్రమం తప్పకుండా ఏర్పాటు చేసేవారు. వచ్చిన ప్రతి అతిథిని పేరు పేరున పలకరించి, అన్నీ అందినవో లేదో తెలుసుకునేవారు. ఆ సమయానికి ఎవరైనా లేకపోతే గుర్తుంచుకుని, వారు వచ్చిన తరువాత వారికి అందించే వారు.

ఒక్కొక్క రోజున ఉదయానికి 50 మందో 60 మందో వుండటం, ఆ లెక్కకు కొంచెం ఎక్కువగానే వంట చేయుటం, తీరా మధ్యాహ్నమయ్యేసరికి రెండు మూడు వందల మంది వచ్చి చేరటం జరిగేది. ఎంత మందికి వడ్డించినా, అక్షయ పాత్ర వలె అందరికి అన్ని పదార్థములు సమృద్ధిగా సరిపోయేవి. యీ అనుభవం అనేకమంది

శ్రీ బాబు భక్తుల యిళ్ళలో ఎన్నోసార్లు జరిగింది; యిప్పటికీ జరుగుతున్నది. శ్రీ బాబు ఉన్నా లేకపోయినా, భక్తులెందరు వచ్చి ఎన్నాళ్ళున్నా అదే మర్యాదతో అదే ఆత్మీయతతో పాపాయమ్మగారు, కాంతమ్మగారు అతిథులను బంధువులకన్నా మిన్నగా ఆదరించేవారు. ఎవరికైనా ఆరోగ్య రీత్యా గాని, దీక్షల కోసం గాని, ప్రత్యేక ఆహార నియమాలుంటే ఆయా ప్రత్యేక ఏర్పాట్లు శ్రద్ధగా తెలుసుకొని మరీ చేయించేవారు. వారాచరించిన యీ మహాద్భుత అతిథిసేవ వ్రతానికి స్ఫూర్తి నిచ్చినదే, యీ అధ్యాయం మొదటిలో తెలిపిన శ్రీ బాబు సందేశము.

శ్రీ గురుదేవుల సమాశ్రయమనే దివ్యమైన స్థిర పెన్నిధిని తమ తరతరాల వారికి అందించి, మాజేటి పున్నయ్యగారు 1961లోను వారి ధర్మపత్ని ఆదినారాయణమ్మ గారు 1990లోను చరితార్థ జన్ములై శ్రీ సద్గురు సాయుజ్యం పొందారు.

పాపాయమ్మగారు , కాంతమ్మగారు, ఆశ్రమ స్థాపనానంతరము ఆశ్రమ స్థిరనివాసులై, ఆశ్రమానికి వచ్చే అతిథులను, గుంటూరులో ఉన్నపుడు తమ యింటిలో అతిథులను ఆదరించినట్లుగా, ఎంతో ఆదర భావంతో భోజన భాజనాదులతో సేవించుకున్నారు. కాంతమ్మగారు 1976లోను పాపాయమ్మగారు 1986లోను శ్రీగురుసాయుజ్యం పొందారు. పాండుగారి కుటుంబము ఆ సేవను యీనాటికీ చేసుకుంటున్నారు.

**మనస్సు ప్రాపంచిక విషయాదులలో**
**సంచరించడమే సంసార బంధం.**
**మనస్సు ఆత్మయందు నిశ్చలత పొందడమే**
**భవ బంధ రహితమగు మోక్షము.**

- శ్రీ కాశీబాబు

# పూరి - కామాఖ్య యాత్ర

(గత సంచిక తరువాయి) - పాలూరి ప్రసాద్

ఇక ఆ మందిరానికి ముందు భాగంలో 1886 జనవరి 1న శ్రీ పరమహంస వారు "కల్పవృక్ష లీల" నెరపిన వృక్షం ఆ దివ్యలీలకు సాక్షిగా ఇప్పటికీ అక్కడ నిలచి ఉంది. ఆనాడు స్వామివారు 'నేనే భగవంతుడిని' అని నిర్ద్వంద్వంగా ప్రకటించి తమను ఆశ్రయించిన సాంసారిక శిష్యులను అందరినీ హృదయంపై స్పృశించి వారికి అలౌకికమైన సమాధి స్థితిని అనుభవింపజేశారు.



ఆ మఠానికి సమీపంలోనే ఉన్న శ్మశానవాటికలో స్వామివారి బృందావనం దర్శనీయం. విశ్వవ్యాప్తమైన శ్రీ రామకృష్ణ మఠాలకు మూలస్థానమైన బేలూరు మఠం అత్యంత విశాలమై నయనానందకరంగా ఉంటుంది. అక్కడి ప్రధాన మందిరంలో శ్రీ రామకృష్ణ పరమహంస వారి దివ్యమంగళ మూర్తికి ఎదురుగా కూర్చొని ధ్యానం చేసుకుంటూ ఉంటే ఆ స్వామే మనలను ఆప్యాయంగా స్పృశించి తమ ఒడిలోనికి చేర్చుకుంటున్నారా అన్న అనుభూతిని కలిగిస్తూ గంగానది పైనుంచి వీచే సాయంకాలపు మందమారుతం మనను సుతారంగా తాకుతూ వుంటుంది.

ఇక వైశాఖ పౌర్ణమి ముందునాటి సాయంకాల ఘడియలలో గంగాసాగర్‌లో పవిత్ర సముద్ర స్నానం అయితే మన భక్తులందరికీ ఎన్నెన్నో విశేష అనుభవాలను మిగిల్చింది. శ్రీ మాతాజీవారు శ్రీగురుపాదుకలను చేత ధరించి సముద్రంలోకి ప్రవేశిస్తే మేమందరం వారు మధ్యలో ఉండగా రెండు వరుసలలో V ఆకారంలో వారి ముందు నిలబడి స్నానానికి సిద్ధమయ్యాము. అయితే జగన్మాతను, శ్రీ గురుపాదుకలను అందుకోవాలనే ఉత్సాహంలో సముద్రుడు పెద్దపెద్ద కెరటాలతో ఎగసిపడుతూ అమ్మను సైతం రెండుసార్లు తూలిపాటుకు గురిచేశాడు. ఇక మూడవ పెద్ద కెరటం మమ్ములను సమీపిస్తూ ఉండగా క్షణంలో నాలుగవవంతు కాలం అమ్మ ఆ సముద్రుని వైపు తీక్షణంగా చూసిన చూపు ఎన్నటికీ మరువలేనిది. అంతే పులిలా వచ్చిన కెరటం పిల్లిలా మారిపోయి, చిన్న అల అయి, అమ్మ పాదాలకు నమస్కరించి వెనుదిరిగింది. మా అందరి స్నానాలు పూర్తి అయి, శ్రీ సద్గురు పాదుకలకు అభిషేకము, అర్చన పూర్తి అయ్యే వరకు మళ్ళీ ఒక్క పెద్ద కెరటం వస్తే ఒట్టు!

ఇక దేశవిదేశాలలో శ్రీకృష్ణ చైతన్యాన్ని విస్తరింపజేస్తున్న మాయాపూర్‌లోని ఇస్కాన్ ప్రధానకేంద్రంలో దర్శనం ఒక అద్భుత అనుభూతి. ఎన్ని వేలమంది భక్తులు ఉన్నా అక్కడ తాండవించే నిశ్శబ్దం, అంతమంది చక్కగా వరుసక్రమంలో దర్శనానికి వచ్చే క్రమశిక్షణ ముచ్చటగొలుపుతాయి.

ఎటువంటి రోగాలనైనా నయం చేసే వైద్యనాథ్ జ్యోతిర్లింగం, తారకేశ్వర్, సతీదేవి మూడవకన్ను పడిన మా తారా క్షేత్రం మొదలైన చోట్ల రద్దీ ఎక్కువగా ఉన్నా దేనికదే చక్కని దర్శన అనుభూతిని కలిగించింది. శృంఖలాదేవిగా భావించబడుతున్న జగత్ గౌరీ మాత ఆ చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలందరినీ సర్పబాధల నుండి రక్షిస్తూ ఉంటుంది.

ఇక అత్యంత దుర్లభమైన కామాఖ్య అమ్మవారి దర్శనం శ్రీగురుదేవుల కృప వలన మా అందరికీ చక్కగా లభించింది. మనందరికీ మాతృస్థానమైన జగన్మాత యోని పడిన శక్తిపీఠం ఇది. అక్కడి అంతరాలయంలో పూజారి సంకల్పం చెబుతూ ఇక్కడ అమ్మ యోనిని స్పృశించిన వారికి ఇక పునర్జన్మ ఉండదు అని మంత్రాలు చదువుతూ ఉంటే "ఎన్ని జన్మములు ఎత్తితినో తల్లి, ఇంకెన్ని జన్మములు ఎత్తెదనో మళ్ళీ, కన్నతల్లి మరి జన్మలనీయకు, కాత్యాయని నీ సన్నిధిలో చేర్చు" అనే కీర్తన మదిలో మెరిసింది. అంతలోనే "మనం జన్మించేది ఆ తల్లి గర్భంలో నుండి అయినప్పుడు, ఆ జగన్మాత బిడ్డగా ఎన్ని జన్మలు ఎత్తితే మటుకు తప్పేముంది?" అని కూడా అనిపించింది.

శ్రీ గురుదేవులు పర్యటించిన ఈ దివ్య క్షేత్రాలు అన్నిటితో పాటు వారి పాదధూళికి నోచుకున్న షిల్లాంగ్ కూడా వెళ్ళడం జరిగింది. అక్కడి ప్రకృతి సౌందర్యం, ఈశాన్య రాష్ట్రాల సంస్కృతిని ప్రతిబింబించే ప్రదర్శనశాల చూసి తీరవలసిందే. ఇక చిరపుంజిలోని నోహ్కాలికై జలపాతం అయితే ఎంతసేపు చూసినా తనివి తీరలేదు. హిమాలయాలకు పాదపీఠమై, 'విరబోసుకున్న పరమేశ్వరుని జటాజూటం' అని అర్థం కలిగిన శివాలిక్ కొండలలో నుండి క్రిందికి పడుతున్న దేశంలోనే ఎత్తైన జలపాతం ఆనాటి గంగావతరణాన్ని తలపింపజేసింది. అయితే ఆ జలపాతం వెనుక ఉన్న విషాదగాథ మాత్సర్యం ఎంతటి నీచమైనదో, శ్రీగురుదేవులు దానిని మళ్ళీ "ఈర్ష్య, అసూయత, అసహనం, ఓర్వలేనితనం" అని నాలుగుగా విభజించి ఎందుకు మాటిమాటికీ ప్రస్తావించేవారో అర్థమయ్యేలా చేసింది.

కాలికాయి అనే స్త్రీ తన భర్త మరణించడంతో ద్వితీయ వివాహం చేసుకొంది. అయితే ఆ రెండవ భర్త తన భార్య తనకంటే తన సంతానమైన నెలల పాపను ఎక్కువగా ప్రేమిస్తోందనే అసూయతో ఆ పసికందును వధించి, వండి ఆ తల్లికి భోజనంగా

వడ్డించాడు. తాను భుజించినది తన కన్నబిడ్డనే అని తెలుసుకొన్న ఆ తల్లి తల్లడిల్లిపోయి ఈ జలపాతంలోకి దూకి ఆత్మార్పణ చేసుకొంది.

ఎన్నికల సమయంలో, ఫలితాల సమయంలో హింసకు ప్రసిద్ధిగాంచిన బెంగాల్ ప్రాంతంలో అదే సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు ఎదుర్కోకుండా ఈ యాత్ర జరిగిందంటే అది కేవలం శ్రీ గురుదేవుల పరమానుగ్రహం, శ్రీ మాతాజీవారు ఆదేశించి, భక్తులందరితో జరిపించిన శ్రీ శివకవచ, శ్రీ దేవీ ఖడ్గమాలా స్తోత్ర పారాయణల మహాత్మ్యం అనే చెప్పాలి. భక్తజనులందరూ దిగ్విజయంగా యాత్ర ముగించుకొని, రైలు ప్రయాణంలో శ్రీగురుదేవులతో తమకు కలిగిన అనుభవాలను ఒకరితో ఒకరు పంచుకొంటూ, శ్రీ కాళీవనాశ్రమం చేరుకొని శ్రీ రామలింగేశ్వర స్వామివారికి అభిషేకాలు, శ్రీ మహాకాళికా పరమేశ్వరీ మాతకు కుంకుమార్చనలు, హోమాలు, శ్రీ సద్గురు పాదపూజతో యాత్రాఫలాన్ని శ్రీ గురుదేవుల శ్రీచరణాల సన్నిధిలో అర్పించి ధన్యులయ్యారు.

## సామూహిక మహాన్యాస పూర్వక నమక చమక రుద్రాభిషేకం

శ్రీ శ్రీ శ్రీ పూజ్య యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ గారి కృపా కటాక్షాలు మరియు దివ్య మార్గదర్శకత్వంలో గత 12 సంవత్సరాలుగా మేము రుద్రాభిషేకం నిర్వహిస్తున్నాము. ఈ పూజ/అభిషేకంలో చాలా మంది పాల్గొని లబ్ధి పొందారు. ఈ సంవత్సరం కూడా జరగబోయే ఈ శుభకార్యానికి మాతో కలిసి పాల్గొనవలసిందిగా మిమ్మల్ని సాదరంగా ఆహ్వానిస్తున్నాము. తేదీ: 5 సెప్టెంబర్ 2026 (శనివారం) సమయం: ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు (CET)వేదిక: శ్రీ వేల్ మురుగన్ టెంపుల్, Sorovej 37, 4295 Stenlillee
https://maps.app.goo.gl/eLGwVSKhbeGfkaqR9
రుసుము: ఉచితం (ఎటువంటి ఛార్జీలు లేవు) పూజా సాగ్రిగలు అక్కడ వారే అందిస్తారు (ఉచితం). అభిషేకం ముగిసిన తర్వాత ప్రసాద వితరణ వుంటుంది.దయచేసి మీ రాకను వీలైనంత త్వరగా ఖరారు చేయండి:

ఇమెయిల్: prasad.isv@gmail.com

ఫోన్‌నంబర్: ప్రసాద్ రాజు (ఆనంద్) +4551509698

దయచేసి ఈ ఆహ్వానాన్ని తోటి భక్తులకు కూడా ఫార్వార్డ్ చేయండి.
ఇట్లు,ఇందుకూరి ప్రసాద్ రాజు (ఆనంద్)


విష్ణు  కథలు

-రమణ ప్రసాద్

(గత సంచిక తరువాయి)

# త్రైలింగ స్వామి

1874లో పృధ్విగిరి అనే శిష్యుడు తనకు గురు బంధువు అయిన విద్యానంద స్వామి వారణాసి వచ్చి రాజఘాట్‌లో బస చేసి, ఒకనాడు త్రైలింగ స్వామిని చూడటానికి వచ్చారు. విద్యానందులను చూడగానే స్వామి లేచి ఆయనను సగౌరవంగా ఆలింగనం చేసుకుని అందరూ చూస్తుండగా ఆ ఇద్దరు మహాత్ములూ అదృశ్యులైపోయారు. తిరిగి స్వామి ఒక్కరూ ప్రకటితమై విద్యానందులను రాజఘాట్‌లో దింపి అక్కడివారికి దర్శనం ఇచ్చి వస్తున్నానని చెప్పారు.



త్రైలింగస్వామి అవతార సమాప్త ఘట్టం కూడా అద్భుతమైనదే. ఉమాచరణ చటోపాధ్యాయ అనే శిష్యునికి ఆరు ఏళ్ళ ముందే తాను దేహం చాలించే విషయం చెప్పారు. ఆరేళ్ళ తరువాత స్వామి గంటల తరబడి గంగా విహారం చేసి వచ్చి తాను దేహం చాలిస్తున్నానని అన్నారు. స్వామికి 32 ఏళ్ళు సేవ చేసిన నమ్మినబంటు మంగళదాసు కన్నీరు మున్నీరుగా ఏడ్చి, భక్తులు పూజ చేసుకోవటానికి గాను స్వామి వారి విగ్రహం చేయించుకోవటానికి మరి కొంత వ్యవధి ఇవ్వమని ప్రార్థించారు. స్వామి అంగీకరించి ఒక నెల గడువు ఇచ్చారు. ఇది తెలిసి శిష్యుడైన ఉమాచరణ చటోపాధ్యాయ, భోలానాథ్, సదానంద్, బ్రహ్మానాధ, కాళీచరణ్ మున్నగువారు స్వామి వద్దకు వచ్చారు. పదిరోజులు ముందు పంచ గంగా ఘాట్‌లో ఒక భూగృహం ఏర్పాటు చేసుకున్నారు. మర్నాడు భూగృహంలోకి వెళ్ళి తలుపులు వేయమని, తానుగా తలుపు తట్టేదాకా తలుపులు తీయవద్దని చెప్పారు. ఈ లోగా స్వామివారి నల్లరాయి విగ్రహాన్ని తెచ్చివుంచారు. మధ్యాహ్నం 3 గంటలకు యోగ సమాధినుండి బయటకు వచ్చారు. అందరికి వీడ్కోలు చెప్పారు. హితోపదేశం సైగలతో చేశారు. హారతులు అందుకున్నారు. సర్వజిత్ పుష్యమార్థ ఏకాదశి, సోమవారం (26.12.1887)న త్రైలింగస్వామి తమ లీలా నాటకానికి ముగింపు పలికారు. స్వామివారు ఆజ్ఞాపించిన విధంగా వారి శరీరాన్ని ఒక చెక్క పెట్టెలో పెట్టి తాళం వేసి అసి నుండి వరుణాఘాట్ దాకా త్రిప్పి నిర్దేశించిన స్థానంలో గంగలో

విడిచారు. కాశీలో వేలమంది ప్రజలు ఈ చరమ దృశ్యం చూసి నివాళులు అర్పించారు. నాటినుండి ఆ మఠంలో వారి విగ్రహానికి నిత్యం అర్చనలు జరుగుతున్నాయి. పతంజలి యోగంలో విభూతి పాదంలో పేర్కొన్న కుంభకయోగిగా ప్రసిద్ధులైన త్రైలింగస్వామి ఒక ఉదాహరణ అని యోగ శాస్త్రజ్ఞులు తీర్మానించారు. త్రైలింగస్వామి సంస్కృతంలో వ్రాసిన "మహావాక్య రత్నావళి" వంగదేశంలో బహుళ ప్రచారంలో ఉంది.

త్రైలింగస్వామి శిష్యుడైన ఉమాచరణ చటోపాధ్యాయ తన అనుభవాలను ఈ విధంగా వివరించారు. "శాస్త్రాలలో స్వర్గ నరకాలు, నానా యోని భ్రమణాలు, సుఖదుఃఖాలు, వారు చేసుకున్న సుకృతులు, దుష్కృతులు వల్ల కలుగుతూ వుంటాయి అని జ్ఞానులు, మహాత్ములు చెప్పగా విన్న నాకు మనస్సులో ఒక సందేహం కలిగింది. కాశీకి వెళ్ళి త్రైలింగస్వామిని దర్శించి నా సందేహ నివృత్తి చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చాను. నేను ముంగేర్ అనే పట్టణంలో ఉండేవాడిని. ముంగేర్ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా ఉన్న సురనాథ చటోపాధ్యాయకు కాశీలో ఇల్లు ఉంది. వారి ఇంట్లో నేను కాశీలో ఉండేందుకు ఏర్పాటయింది. పంచ గంగా ఘాట్‌లో మహాత్మా త్రైలింగస్వామి ఆశ్రమాన్ని చూశాను. నాకు కాశీ పట్టణం చూపిన వ్యక్తి త్రైలింగస్వామి గురించి ఇలా చెప్పాడు, "ఆయన ఏది దొరికితే అది తింటాడు. ఎవరితోను మాట్లాడడు. దిగంబరంగా తిరుగుతుంటాడు. ఎండాకాలంలో ఇసుక తిన్నెలమీద నిదురిస్తాడు. వణుకు పుట్టించే చలిలో నీళ్ళలో ఉంటాడు. ప్రజలు ఆయనను 'కుంభక యోగి' అంటారు" అని అన్నాడు.

- సశేషం


**16-9-2026 బుధవారం నుండి 20-9-2026 ఆదివారం వరకు**

**శ్రీకాళీవనాశ్రమ భాగ్యనగర శాఖలో**

**పూజ్యశ్రీ మాతాజీవారి సత్సంగ కార్యక్రమాలు జరుగును.**

**అందరూ ఆహ్వానితులే!**



Printed & Published by Paluri Siva Rama Kaliprasad, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Nagendra Enterprises, 24-7-8, Sandeep Mansion, Jonnavittula Vari St.,Gandhi Nagar, Vijayawada-520003, N.T.R.Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

జులై 2 నుండి 5 వరకు అమెరికాలోని ఫోర్ట్‌మిల్ నందు
శ్రీ రామరాజు మరియు నీలాదేవి వారి గృహములో నిర్వహించబడిన
త్రయాహ్నిక దీక్షా మరియు లలితకళా ప్రదర్శన దృశ్యములు









REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on Fifth and Sixth of every month

RNI No. 37804/81
POSTAL REGD. No. : GTR/27/2024-26

## జూలై 2 నుండి 5 వరకు అమెరికాలోని ఫోర్డ్‌మిల్ నందు శ్రీ రామరాజు మరియు నీలాదేవి వారి గృహములో నిర్వహించబడిన త్రయాహ్నిక దీక్షా మరియు లలితకళా ప్రదర్శన దృశ్యములు





If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.